Reg. No. 1118.

Founder: K. NAGESWARA RAO

# ఆంధ్రపత్రిక

విడిపత్రిక అణా.

Editor: S. SAMBHU PRASAD.

Vol. 29. * ANDHRA PATRIKA, MADRAS, TUESDAY, 8-9-42 * No. 150

# కేంద్రమున జాతీయప్రభుత్వము స్థాపించవలెను

## ఆనీగారి ప్రతిపాదనకు సవరణ

## నాయకులను విడుదలజేయవలెననుకోరిక

### భారతశాసనసభా కార్యక్రమ విశేషములు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:—

భారతశాసనసభలో భారతదేశ పరిస్థితినిగురించి పరిశీలించవలె ననియం. యస్. ఆనీగారు ఉపపాదింపదలచిన తీర్మానమునకు డా॥ పి. యన్. బెనర్జీగా రొకసవరణ సవపాదింప గోరిరి. అది యీక్రిందివిధముగ నున్నది.—

"ఇండియాలో యిప్పుడేర్పడి కోనదనీయమైన స్థితిని వెంటనే తొలగించుటకున్ను, యిండియాలో మిత్రమండలివారు జరుపుతున్న యుద్ధసన్నాహము లింకా చాలఅధికముగా జరిగేలాగు చేయుటకున్ను, ఆగస్టు నెల 7 తేది పిమ్మట అరెస్టుచేయబడిన కాంగ్రెసు వారికందరిని వెంటనే వదలివేయవలెను. సెంటరులో జాతీయ ప్రభుత్వము నేర్పరుచుటకు జరుగవలసిన యేర్పాటులన్నిటిని వెంటనే జరుపవలెను. సెంట్రలు అసెంబ్లీలో వున్న అన్ని పార్టీల ప్రతినిధులున్ను యీ ప్రభుత్వములో వుండవలెను. ఈప్రభుత్వము భారతీ అసెంబ్లీకి బాధ్యముగావుండవలెను. గవర్నరులు పరిపాలిస్తున్న ప్రతిరాష్ట్రములోను కూడా యిటువంటి ప్రభుత్వములనే యేర్పరచవలెను" అని ఈ సభవారు గవర్నరు జనరలు కౌన్సిలువారికి సూచిస్తున్నారు.

### అసెంబ్లీ ప్రభుత్వ సభ్యులకు దేశముఖుగారి సూచనలు

"భారత అసెంబ్లీలో జరుగవలసిన కార్యక్రమము సరిగా జరుగుటకు యిపుడు చేయబడిన కాలనిర్ణయము చాలదు. ఇది చాలా తక్కువగావున్నది. అందువల్ల యీ సమస్యవల్ల యెక్కువ ప్రయోజనము కలుగుతుందని తోచదు. అనధికారసభ్యులుపపాదించిన ముఖ్యమైన బిల్లులు చాలావున్నాయి వీటిని గురించి చర్చించుటకు వ్యవధి వుండవలెను. కొన్ని బిల్లులు కమిటీ వేజివరకూ వచ్చాయి. హిందువుల వివాహముల బిల్లునుగురించి రావుసంఘమువారు చాలా రోజులపాటు చర్చించివున్నారు. ఇటువంటి ముఖ్యమైన బిల్లు లింకా చాలావున్నాయి. మరికొన్ని బిల్లులనవుపపాదించవలసివున్నది" అని యిప్పుడు ఢిల్లీలోవున్న అసెంబ్లీసభ్యులు చెబుతున్నారు.

అసెంబ్లీసభ్యులలో వకరైన గోవిందదేశముఖుగారు దీనినిగురించి యీలాగు వకప్రకటన చేశారు.

"ఇప్పుడు నిర్ణయించబడిన కాలావధిలోనే యిటువంటి బిల్లులనుగురించి సభలో చర్చ జరుగవలెను. సభ్యుల ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు, అత్యవసరమైనంటు తీర్మానములు వీటినిగురించి ప్రభుత్వసభ్యులు మామూలు పద్ధతినే అవలంబించగూడదు. ప్రశ్నలకు జవాబులను చెప్పుటలో వారు అన్ని వివరములను పూర్తిగా తెలియచేయవలెను. సభ్యులకు సంతృప్తికలిగేలాగు జవాబులను చెప్పుటలో వీరు స్టాండింగుఆర్డరులలో హయ్యరుపాయింటులనుకూడా పాటించగూడదు.

అధ్యక్షుడు అనుమతి నిచ్చిన అత్యవసరమైనంటు తీర్మానములకు నాకు తెలిసినంతమట్టుకు సర్ రామస్వామిగారెన్నడున్ను అభ్యంతరమును చెప్పియుండలేదు. ప్రభుత్వసభ్యులందరున్నుకూడా సర్ రామస్వామిగారి పద్ధతినే అవలంబించవలెను. వీరీలాగుచేస్తే సభ్యులకందరికిన్నీ అధికమైన సంతృప్తి కలుగుతుంది. ఈపద్ధతులలో యిపుడు సభ్యులలో చాలామందికి అసంతృప్తి చాలా అధికముగానే వున్నది. ప్రభుత్వసభ్యులు తమ పద్ధతిని మార్చుకుంటేగాని వీరు సభలో చర్చించుటకు వీలుండదు. (అ. ప్రె.)

## స్టాలినుగ్రాడునుండి టాంకు ఫ్యాక్టరీలను తొలగించుట

### రష్యనుల ముందు జాగ్రత్తలు

### డాన్, వాల్గానదులమధ్యనున్న ప్రదేశమున రష్యనుల తిరుగుదాడులు

సపరాసిస్కు- పడిపోలేదని రష్యను ప్రకటన

లండను, సెప్టెంబరు 8:—

స్టాలిన్గ్రాడు గొప్ప టాంకునిర్మాణకేంద్రము. టాంకు శకటములను తయారుచేయు యంత్రములనన్నిటిని రష్యనులు స్టాలిన్గ్రాడునుండి వేరొక చోటికి మార్చిరని ఇచ్చట సమాచారము తెలిసినది.

### స్టాలిన్గ్రాడురంగం

స్టాకుహోం, సెప్టెంబరు 8:—

సాయుధటాంకుశకటములను టాంకులను విశేషసంఖ్యగా తయారుచేసి రష్యను సైన్యమునకు సమర్పించు ఫ్యాక్టరీల యంత్రములు పరికరములు స్టాలిన్గ్రాడు నగరమునుండి వేరొకచోటికి పోయినవని స్వీడెనులో కూడ వార్త తెలిసెను. ఈటాంకు ఫ్యాక్టరీలలో ముఖ్యమైనదానికి స్టాలిన్ ట్రాక్టరు వర్కున్ అని పేరు. అది కూడ నగరము విడిచిపోయినది.

### బాంబుల వర్షము

లండను, సెప్టెంబరు 8:—

జర్మనులు బాంబులవర్షము కురిపించుచున్నను వాల్గానదిమీదుగా స్టాలిన్గ్రాడుకు సప్లయిలు వచ్చుచున్నవని లండనుకువచ్చిన వార్తలో కలదు.

### నగరవీధులలో పోరాటము జరుగుటలేదు

స్టాలిన్గ్రాడు, సెప్టెంబరు 8:—

నగరవీధులలో పోరాటము జరుగుచున్నదని పుట్టిన వదంతులు నిరాధారమని జర్మను సైనికాధికారి ముఖతా తెలియవచ్చెను.

### డాన్-వాల్గాలమధ్య రష్యనుల తిరుగుదాడి

స్టాకుహోం, సెప్టెంబరు 8:—

స్టాలిన్గ్రాడున కుత్తరమునన్నున్న ప్రదేశమున స్టాలిన్గ్రాడుకు సమీపమున రష్యనులు మొండిగాపోరాడి కొన్ని ముఖ్య స్థలములను వశపరచుకొనిరి. 2 జర్మను సైనిక కంపెనీలు సర్వనాశనమైనవి. ఇది ఇట్లుండగా స్టాలిన్గ్రాడుకు ఇంకను దూరమున, ఖోపరునది డాన్‌నదిలో కలియుచోట భీషణమగు పోరాటము ప్రారంభమైనది. ఇచ్చట రష్యనులు తిరుగుదాడులు ప్రారంభించి రని దీనిఅర్థము.

బిచీ, సెప్టెంబరు 8:—

తిరుగుదాడులు మొదలైన సంగతిని విచీ రేడియోకూడ ప్రకటించెను. మాస్కోరంగమునుండి రష్యను సైన్యములువచ్చి స్టాలిన్గ్రాడున కుత్తరమున, డాన్‌నదిమీదనున్న కచాలినోకును వాల్గానదిమీదనున్న దుబోవ్కాకును మధ్యనున్న ప్రదేశములో గల జర్మనుసేనలను తాకినట్లు విచీ రేడియో స్పష్టముగా తెలుపుచున్నది. డాన్-వాల్గాల మధ్య దూరము ఇచ్చట చాలాతక్కువ.

### స్టాలిన్గ్రాడుకు దక్షిణమున

మాస్కో, సెప్టెంబరు 8:—

నగరమున కుత్తరమున స్థితిగతు లిరీతిగా నుండగా దక్షిణమున 3 సార్లు శత్రుజాడులను మరలింపవలసి వచ్చెను. అట్లు చేయుకున్న నగరమున కపాయ మేర్పడియుండెడిదే. జర్మనుటాంకు లొకమారు రష్యను సేనల భేదించెనుగాని చివరకు తరిమివేయబడెను.

నగరమువద్ద ఉభయుల సేనలును తలపడుటకు ఎంతోకాలము పట్టునట్లులేదు.

### సూటిగా దాడి

ఉత్తరమునుండి దక్షిణమునుండి గాక సూటిగా తూర్పుగా దాడిసలుపుచున్న శత్రుసేనలు ముందుకువచ్చినవి. రష్యనులు కొంచెము వెనుకకుతగ్గిరి.

### నగరములో స్థితి

శత్రువిమానములు భీకరముగా బాంబులు వేయుచున్నను నగరములో ప్రజాజీవితము యథాప్రకారముగానే యున్నది. తత్తరపాటు కనుపించదు. హోటళ్లు అంగళ్లు అన్ని తెరిచియున్నవి. నగరద్వారములను

(3-వ పేజీచూడుడు)

## సాలమన్ దీవులు

### క్రొత్త అమెరికను సేనల రాక

### శత్రువు సేనను దింపజాలకపోయెను

వాషింగ్టను, సెప్టెంబరు 7:—

అమెరికను ప్రకటన:—

"సాలమన్ దీవుల కూటమిలో గూడాల్‌కనాల్‌లో అమెరికనులు క్రొత్తసేనలను దింపగలిగిరి. ఈ సేనలున్న స్థలములపై 26 శత్రు బాంబరు విమానములు 20 ఫైటరు విమానముల సహాయముతో వచ్చెనుగాని అమెరికను విమానము లక్షముపచ్చి వాటిలో మూడింటిని కూల్చినవి. శత్రువిమానములు జోసిన బాంబులవల్ల కొద్ది నష్టముమాత్రము కలిగెను. క్రొత్త అమెరికనుసేనలు తీరముచేరకముందు జపాను జలాంతర్గాములు వాటిని ముంచుటకు వచ్చెనుగాని ఆఎత్తుగడ కొనసాగలేదు.

### శత్రు ప్రయత్నము

శత్రువు కొంతసేనను గూడాల్‌కనారులో అమెరికను లాక్రమించిన అడవిప్రదేశములో దింపుటకు ప్రయత్నించెనుగాని అమెరికను వైమానికుల ప్రతిఘటనమువల్ల ఈ ప్రయత్నము కొనసాగలేదు. పైగా చాలామంది శత్రుసైనికులు మరణించిరి. వారిని కొనివచ్చు బోట్లు అనేకము మునిగిపోయెను.

### విమానాశ్రయ నిర్మాణం

ఆగస్టు 7 వ తేది గుడాల్‌కనారు-టులాగి ప్రాంతము అమెరికనుల వశమైనది. అప్పటినుండి అచ్చట అమెరికనులు క్రొత్తసేనలు చేర్చగలిగిరి. గుడాల్‌కనారులో విమానాశ్రయము నిర్మింపబడెను. ఇచ్చటినుండి అమెరికను విమానములుపోయి శత్రువుపై విజృంభించుచున్నవి.

### అమెరికను నష్టం

ఈ ప్రాంతములో దిగు అమెరికను సేనలకు శత్రుచర్యవల్ల కొంతనష్టముతప్పలేదు. బ్లూఅను అమెరికను డిస్ట్రాయరు, సప్లయి నావయగు కోల్హౌను, ఈ ప్రాంతమునకు సప్లయిలు భద్రముగాచేర్చు కార్యములో మునిగిపోయెను.

క్రొత్త అమెరికను సేనలపై బాంబులు వేసిన జపాను విమానములలో అనేకము కూల్చబడినవి. వాటి దాడులవల్ల మాకు కలిగిన నష్టము అత్యల్పము.

గూడాల్‌కనారు విమానాశ్రయమునకు 65 మైళ్ళదూరమున సాన్‌జార్జిదీవిదగ్గ, సైనికులను కొనివచ్చిన జపానుబోట్లు బాంబుఘాతములవల్ల సముద్రగర్భము జొచ్చినవి.

గుడాల్‌కనారులో అడుగుపెట్టుటకు శత్రువుచేసిన ప్రయత్నము ఈరీతిగానే వ్యర్థమైనది.

## ధరల కంట్రోలు

### అమితలాభాలు తీయనట్లు ఆలోచన

### సర్కారుగారి ప్రసంగము

### ఆరవ ధరలకంట్రోలు సభ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:—

భారతప్రభుత్వ వాణిజ్యాంగ సభ్యులు యస్. ఆర్. సర్కారుగారు నేడుమయం సమావేశమైన ఆరవ ధరలకంట్రోలు సభలో మాట్లాడుచూ ప్రస్తుతం ధరలకంట్రోలు విషయంలో అనుసరిస్తున్న విధానంలో గల లోపాలను చర్చించి యీవిధానం పటుతరంగా ఉండుటానికి కొన్ని మార్పులను సూచించిరి. ఈవిధానాన్ని అనుసరించుటం వల్ల బరుకష్టపడుతుంటే వారిమూలంగా యింకొకరు లాభాలు పొందకూడాదేయుటయే ఉద్దేశమనిన్ని వారు చెప్పిరి.

వారింకను యిట్లు ప్రసంగించిరి:—

"ఆహారపదార్థాల ఉత్పత్తి నెక్కువ చేసినప్పుడు ధరలుకూడా ఒక న్యాయమైన ప్రమాణానికి అభివృద్ధికావలెను. అందువల్ల మళ్లీ కొనుగోలుదార్లకు కష్టముండరాదు. ఈరెంటిని సమన్వయం చేయుటాని కీధరలను నిర్ణయించేయజూచితిమి. ఇందులో యెంతవదనాడైనా మంచి ఆహారపదార్థాలను తగినంత కొనుక్కొటానికి తగ్గట్లు కొన్నింటి విషయంలో ధరలను కనీసమైనవాటిని నిర్ణయించవలసి ఉంటుంది. ఇట్లాచేసినా ఉత్పత్తిదారులు కష్టపడకుండా కొద్దిపాటి లాభములను పొందుతూ కావలసినంత సిద్ధము జేయుటకు తగినట్లున్ను యెక్కువగా నిర్ణయించవలెను. లేదా, యీ ధరలు యెక్కువగా ఉన్నయ్యని కొనుగోలుదారులు యుద్ధసమయంలో సులభంగా ప్రత్యామ్నాయంగా దొరికే యితరసరుకులను కొనుక్కొనేటట్లు చేయవలెను. ఈవిధంగా ధరల నిర్ణయంచేయటంలో అనేకసందర్భాలను సమన్వయం చేయవలసి ఉంటుంది. అందువల్ల సంఘానికి కాగల్గినంత మేలుకలుగుతూ యెవరికిన్ని నష్టంకలగకుండా చూడటమే పని పరమావధి.

### సవరణల ఉద్దేశం

ధరల కంట్రోలు విధానంలో తలపెట్టిన మార్పులవల్ల కొంతవరకు మార్కెటులో విపరీతంగా ధరలు పెంచడం జరగకుండా చేయాలనే ముఖ్యంగా తలపెట్టితిమి. ఈ ధరలు పెంచేవారి మూలంగా యీదేశంలోనే గాకుండా గ్రేటుబ్రిటనులో, ఆస్ట్రేలియాలోగూడా ధరలు నిర్ణయం చేయటానికి చిక్కుకలిగింది. ఆదేశాలలో చాలా గట్టిచేర్పాట్లు చేసారు.

ఇండియాలోగూడా విపరీత లాభాలు యేవిధంగాను తీయకుండా గట్టిపని చేయవలసిఉన్నది. కాని ప్రభుత్వంవారెంతచేసినా యీ దోషం తొలిగేటట్లు చేయటానికి వ్యాపారస్థులమీదముఖ్యంగా బాధ్యతఉంది. ధరల నిర్ణయం చేసే విధానంలో యిపుడు వ్యాపారం జరుగుతున్న మార్గాలను మార్పు చేయటం యిష్టంలేకపోవటంవల్ల వ్యాపారస్థుల నిందు చేర్చుటంవల్ల వారి బాధ్యతను గురించి చెప్పవలసి వచ్చింది. ఈ అంశాలను వ్యాపారస్థుల ప్రతినిధులసభలో త్వరలోనే తెలిపి ప్రభుత్వమునకు సహాయం చేయవలసిందిగా విజ్ఞప్తిచేసెదను. ఇపుడు కంట్రోలు ధరల విషయంలోనే గాకుండా, కంట్రోలు సరుకుల సరఫరా, పంపకం విషయంలో గూడా యేర్పడవలసిన సమయం వచ్చింది

ఇప్పుడీవిధానం బాగా పనిచేయవలెనంటే యే యే ప్రాంతాలలో ఎంతెంత సరుకు నిలవవుండో, యెంతెంత కావలసి ఉంటుందో సరిపైన లెక్కలను తయారు చేయవలసి ఉంటుంది. ఆహారద్రవ్యాలు యేయే ప్రాంతాలలో తక్కువగా ఉన్నయ్యో అక్కడికి యెక్కువగా ఉన్న ప్రాంతాలనుంచి పంపించే సమాలోచన చేయవలసి ఉంటుంది. ఈ తక్కువగా ఉన్న ప్రదేశాలలోగూడా స్థానికాధికారులకు చాలా చిక్కులు ఉంటవి. ఆ జిల్లాలోనే ఒకచోటనుంచి యింకోచోటికి సరుకులరవాణా చేయటంలో, ధరల విషయంలో ప్రక్క జిల్లాలలోనివాటికి, మొదట కొన్న ధరలకు, చిల్లర వ్యాపారంలో అమ్మేధరలకు ఉండే వ్యత్యాసాలను జూచి సరిచేసుకోటంలోను కష్టమున్నది.

### సహకారమునకై విజ్ఞప్తి

ఈ సందర్భంలో సంబంధించినవారంతా గూడా తాము చేయగల విధానము చేతానికైనాన్యానికి ఆహారద్రవ్యాలు సరఫరా చేసేందుకు తగిన విధానం యేర్పరచటంలో సహకారం చేయవలెనని విజ్ఞప్తి చేస్తున్నాను. పరిస్థితులనుబట్టి ప్రభుత్వం లేక విధానాన్ని సరిపుచ్చుకోవలసి ఉంటుంది. దేశంలో సరుకు చెలామణి తక్కువలేనపుడు ఒకటికి రెండు బస్తాలు గోదాములో బియ్యమో యిట్లా నిలవచేసుకోటంవల్ల మార్కెటులో సరుకు చలామణి అంతవరకు తక్కువై పోతుందని కొనుగోలుదార్లు తెలుసుకోవలెను. తనకు తాను యేదో ముందుగా జాగ్రత్త పడ్డాననుకోవచ్చుగాని అది సంఘానికి విరుద్ధమైన చర్య అవుతుంది.

వర్తక వ్యాపారముల జేయువారు యీ సందర్భంలో సహకారం చేయటంఅవసరం. కంట్రోలుపద్ధతికి అనుకూలంగా సమన్వయం చేసుకొని సంచరించవలెను. ఈవిధంగా అందరును సహకారం చేసేట్లైతే ధరల కంట్రోలు బాగా జరుగగలదు. యుద్ధ సమయంలో సైన్యమునకు, జనసామాన్యమునకు ఆహారపదార్థాల కొరతలేకుండాఉంటుంది. ప్రస్తుతం యెన్నిలోపాలున్నా సర్వత్రా యీవిషయంలో కృతనిశ్చయం కలిగివుండవలెను. అంతేగాకుండా ఒకకార్యక్రమం సంపూర్ణమైనది, ఘనమైనది ఉండవలెను. అపుడు విజయవంతముగా నీ పని జరుగగలదు.

### చర్చ

అధ్యక్షోపన్యాసమైన పిదప అందులో జేయబడిన సూచనలపై చర్చ జరిగినట్లు తెలుస్తుంది. గోధుమలు ఆ సంబంధమైన పదార్థాలు యెక్కువగావున్న రాష్ట్రాల నుంచి తక్కువగావున్న రాష్ట్రాలకు రవాణాను నిర్ణయంచేయటంలో కేంద్రప్రభుత్వం చేసే యేర్పాటు సంగీకరిస్తూ అభిప్రాయములు తెలుపబడెను. ప్రభుత్వంవారు నిర్మించేసంస్థ మిలిటరీవారికి, తక్కువగాఉన్న రాష్ట్రాలకు సంస్థానాలకు నిర్ణయించుకొన్న మేరకు కొనవలెననియు, ఆపరుకు రవాణాకు మిలిటరీ అవసరాల తరువాత ప్రాధాన్య మీయవలెననియు నభిప్రాయము నెల్పిరి.

రాష్ట్రాలుగూడా యిదేవిధంగా ఆహారపదార్థాలు యెక్కువగా ఉన్న ప్రదేశంనుంచి తక్కువగా ఉన్న ప్రదేశానికో, సంస్థానానికో రవాణాచేయవచ్చునను నభిప్రాయమే తెలుపబడెను. బియ్యం, జొన్నలు, కందులు మొదలైన ధాన్యముల ధరలకు గూడా కంట్రోలు ఉండవలెనా అనే విషయమున్ను, సెంట్రలు ప్రెసు, సప్లయి బోర్డు నిర్మాణము, సీలు సప్లయిల అడ్వైయిజరీ కౌన్సిలు, స్థాపించటం గూర్చిన్ను, నీదవాళ్లుండే చోట్ల ప్రభుత్వమువారుగాని, స్థానికసంస్థలుగానిచౌకగా ధాన్యం అమ్మేదుకాణాలను ఇట్టిటంగూర్చిన్ను, విక్రయంలో అన్యాయాలు చేసేవారికి కంట్రోలు యెక్కువచేసిన్ని నిలవసరకు స్వాధీనపరచుకొనిన్ని, శిక్షలు విధించే విషయమున్ను యీసభలో యింకను చర్చించబడెను. (అ ప్రె.)

## ఆఖరుకు మనకే గెలుపు కలుగును

### ప్రెసిడెంటు రూజువెల్టు నమ్మకము

### రష్యావారు నాజీలందరిని పారద్రోలెదరు

### అమెరికాప్రజలకు ప్రెసిడెంటు రూజువెల్టు బ్రాడ్‌కాస్టు

వాషింగ్టను, సెప్టెంబరు 8:—

నేటిరాత్రి ప్రెసిడెంటు రూజువెల్టు బ్రాడ్‌కాస్టు ఉపన్యాసము గావించుచు, వివిధరంగములయందలి యుద్ధ పరిస్థితులను సింహావలోకనము గావించి ఒకవేళ రష్యావారికి ప్రస్తుతము అపజయము కలిగినను, ఆఖరుకు వారు నాజీలందరిని రష్యానుండి వెడలగొట్టెదరనియు, ఆఖరుకు మిత్రమండలివారికే విజయము కలుగుననియు చెప్పెను.

### రష్యారంగము

ప్రెసిడెంటు రూజువెల్టు ఈ క్రిందివిధముగా చెప్పెను:—

అనేకలక్షల జర్మనులు రష్యారంగములో మరియొక సంవత్సరము గడుపవలసి వచ్చునట్లున్నది. తనకు విజయముకలిగెనని ఒక సంవత్సరము క్రిందనే హిట్లరు ప్రకటించినను రష్యాలో నతడు యింకను గొప్ప విజయము పొందజాలకపోయెను. రష్యావారి దేశములో ముఖ్యమైన దేశము అతని హస్తగతమైన మాట నిజమే. కాని అతడు సోవియటుసేనను నాశము చేయజాలకపోయెను. ఇతర రంగములలో నాశమైన జర్మను సైనికులు, విమానములు, టాంకులకంటె ఎక్కువమంది జర్మనులను విమానములను టాంకులను రష్యావారు నాశము చేయుచున్నారు. రష్యావారికట్టి అపజయములు కలిగినను. వారు పోరాడుచుసేయుండి, మిత్రమండలివారి సహాయముతో నాజీలందరిని తమ దేశమునుండి వెడలగొట్టెదరు.

### పసిఫిక్ ప్రాంతము

సాలమన్ దీవులలో మనకుకలిగిన విజయముయొక్క ప్రాముఖ్యమును మనము గొప్పజేయరాదు. మిడ్వేద్వీపమువద్ద మనకు కలిగిన విజయమును స్వల్పమైనదిగా తలపరాదు. ఇచ్చట జపానువారి గొప్పపోటును, మనము ఆపితిమి. ఐనను జపానువారి కింకను చాలా బలముకలదు. ఆధిక్యతను పొందవలెననివారు ప్రయత్నించుచున్నారు. మరలవారు గొప్ప పోటు గావింపగలరు.

### మధ్యధరా, మధ్యప్రాచ్యము

ఈజిప్టు కొరకును, మధ్యధరా, భారత మహాసముద్రాధిపత్యము కొరకును మహాఘోరయుద్ధము జరుగుచున్నది. మనకుకలుగగల అపాయము మనకు బాగుగా తెలిసియే యున్నది. కాని తుట్టతుదకు జయము మనకే కలుగునని మనము ఆశతో నున్నాము.

### ఐరోపాలో జర్మనీపై పోటు

జర్మనీపై పోటు సాగించుటయే ఐరోపా రంగమునందు మన ఉద్దేశ్యమై యున్నది. ఐరోపాలో ఒకడజను ప్రదేశములనుండి మనముదాడిచేయదీలగును. ఇందువిషయమై నేను వివరములు తెలుపజాలను. కాని జర్మనీపై పోటుచేయుటకు ఈదేశములోను, బ్రిటనులోనుగూడ సన్నాహములు జరుగుచున్నవని మీరు నమ్మవచ్చును. జర్మనీ బలమును ఐరోపాయుద్ధభూములలోనే నాశము గావింపవలసి యున్నది. నాల్గురంగములలో నేదో ఒకరంగమునందు మనము మన బలములను కేంద్రీకరింపవలెనని చాలమంది కోరుచున్నారు. వీనిలో ఏ ఒక్కదానిని వదలివేయవలెననిమాత్రము యెవ్వరు సూచించుటలేదు. రష్యాకు సహాయము ఆపుచేయవలెనని యెవ్వరైనను చెప్పగలరా? పెసిఫికును జపానుకు వదలివేయవలెననిగాని, మధ్యధరాసముద్రమును, మధ్యప్రాచ్యమును జర్మనీకి వదలివేయవలెననిగాని, జర్మనీపై పోటు మానివేయవలెననిగాని, యెవ్వరైనను చెప్పగలరా? ఈ నాల్గు గొప్ప యుద్ధరంగములలో దేనినిగూడ మేము అశ్రద్ధచేయమని అమరికాప్రజలు నమ్మవచ్చును. సైనికసంబంధములైన ముఖ్య నిర్ణయములు కొన్ని జరిగినవి. ఈనిర్ణయములేవో కాలక్రమేణ మీకును, శత్రువులకుగూడ తెలియగలవు. శత్రువుపై పోటుచేయు నుద్దేశ్యముతోనే ఈ నిర్ణయములన్నియు జరిగినవని నేనిప్పుడు చెప్పగలను.

### యుద్ధములో జయము కలుగును

పెరల్‌హార్బరు ఉదంతము జరిగి యిప్పటికి సరిగా తొమ్మిదినెలలైనది. గత మహాసంగ్రామమునందలి మొదటి 9 నెలలలో మనము ఫ్రాంసుకు పంపియుండిన సేనల కంటె మూడురెట్లసేనను ఈ 9 నెలలలో మనము ఖండాంతరములకు పంపియుంటిమి. మన శత్రువులను ప్రతిఘటించి పోరుచున్న మిత్రమండలి రాజ్యముల సైన్యములయొక్కయు, నాకాదళములయొక్కయు, విమానదళములయొక్కయు పరస్పరసహాయముతో ఆఖరుకు యుద్ధములో మనకు విజయముకలుగును.

### ఆర్థిక కట్టుదిట్టములు చేయవలెను

యుద్ధమునకై 1943 సం॥ లో మనకు 10 వేలకోట్ల డాలరులు కావలసివచ్చును. గొప్ప ఆర్థికదుస్థితి మనము తొలగింపవలసినచో వెంటనే మనము చర్యకై కొనవలసి యున్నది. 2, 3, 4 లేక 6 నెలలు వేచియున్నచో చాల అనర్థము వాటిల్లును.

LACTOPEPTINE

లాక్టోపెప్టిన్ అజీర్ణమును అంతమొందించును




ప్రజలు అనుభవించు బాధలకు పదిలో తొమ్మిదవంతు అజీర్ణమే కారణము. మీరు సాధారణముగా భుజించు ఆహారములో మీకు ఆరోగ్యమును, సత్తువనుయిచ్చు పదార్థము యుండవలెను. ఆ యాహారము మీకు కడుపులో మంట గలుగజేసి, వాయువుచేరి కడుపు ఉబ్బిన మీ రెట్లు ఆరోగ్యవంతులుగా నుందురు? లాక్టోపెప్టిన్ సేవించిన ఈబాధలనుండి అతిత్వరలో విముక్తు లగుదురు.

లాక్టోపెప్టిన్ ఆహారము సహజరీతిపలె జీర్ణమగునట్లు చేయును.

లాక్టోపెప్టిన్‌లోని సహజగుణ మిదియే. సహజరీతిపలె ఆహారము జీర్ణమగును. సహజమూ జీర్ణమగుటకు ఏపదార్థములు అవసరమో, అపదార్థములు దీనిలో నున్నవి. మీ భోజనానంతరము దీనిని సేవించి పరీక్షించి చూడుడు. ఎట్టిబాధగాని, కష్టముగాని లేకుండ ఉల్లాసముతో నుందురు. మీకు మూసినగుణమునను మీరే ఆశ్చర్యపడుదురు. లాక్టోపెప్టిన్ మూడువిధములుగా లభించును. బిళ్ళలు, పొడి, ద్రవము. అందరు కెమిస్టులవద్ద, అన్నిస్టోర్లలో అమ్మబడును.




దీనిని పారద్రోల యీ విధంగాయుండుము

సిరోలిన్ రోచ్

దగ్గులను పడిసెమును నిర్మూలించును.

వీరి యొందిన దినమే సుదినమగును. సత్యం. సు 2-8-0 ఇంపువారికి
**మదనచింతామణి లేహ్యము**
నర నిన్ని పంపబడును. వృద్ధులును బాలురును, నీర్యకులును, నరములను బలమునిచ్చు, మంచి సుఖమునిచ్చును.
శ్రీ నీరభ్రహ్మాం వైద్యశాల,
సుస్థిరిమిల్లు, కవి పోస్టు, నెల్లూరు జిల్లా.

**WANTED**

WANTED 250 CANDIDATES FOR Railway Services as Station Masters, Guards, Signallers, Ticket-collectors. Free quarter. Railway fare paid. Scholarship Rs. 80. Apply with 0-1-6 to Director, All-India Railway Commercial & Telegraph School, Daryagunj, Delhi.

**పుస్తకములు**

| | |
|---|---|
| మనస్తత్వ - శాస్త్రము - కొలను | రూ. 4-0-0 |
| మహాపురుషుల జీవితములు | ,, 2-0-0 |
| శ్రీ కృష్ణచైతన్యావతారము | ,, 2-0-0 |

మూడు ఒకేసారికొనువారికి రు. 6-0-0 మాత్రమే పోస్టేజి రు. 1-6-0 వేరు.
వి. వి. రత్నశర్మ, దుర్గాగ్రహారం, బెజవాడ.

**మునసబ్ పరీక్ష పుస్తకములు**

గ్రామ మునసబుల పరీక్షా ప్రశ్నలు, మెదటి, రెండవ భాగములు, నూతనముగా రచింపు చేయబడి, అష్టకమునకు సిద్ధముగా నున్నవి. వలమువారు.
అడ్రసు:—బాలేమర్తి నాగభూషణరావు,
ఆరండలుపేట, నంబూరు.

**తప్పిపోయినాడు**

ఎనిమిది సం॥లుగల బ్రాహ్మణ మగ పిల్లవాడు. మూగవాడు. చామనఛాయ. ఆగస్టు 14 వ తేదీని తప్పిపోయినాడు. ఎచటనైనా కనపించిన ఈ క్రింది చిరునామాకు తెలియపర్చవలెను. బహుమాన మీయబడును. దామరాజు శేషాచలము, కో-ఆపరేటివు ఇనస్పెక్టరు, ఏలూరు.

**ప్రకటన**

ది ఆంధ్రా పేపరు మిల్సు కంపెనీ లిమిటెడ్, రాజమండ్రి.
వాటాదారులకు హెచ్చరిక
**వేర్లు అమ్మవద్దు**
కైనరా పల్పు అండ్ పేపరుమిల్లుతో సంబంధించిన ముఖ్యులు మరికొందరితో కూడి కైతాన్ ఆప్టే అండ్ కంపెనీ అను పేరున మరల రంగమున దిగి, వేలకొలది వున్న వాటాదార్లను లేనట్లుగా భావించి, యథాప్రకారము మిల్లును స్వాధీనముచేసికొని నడపుటకు పాతపుంతను త్రొక్కిరి. మేనేజింగు ఏజంట్లు అయిన దయారాం అండ్ సన్సువారిని వాటాదారులు తొలగించి (వారు తుదకు రాజీనామా కూడా యిచ్చిరి) కొత్త మేనేజింగు ఏజంట్లను యేర్పాటుచేయు నిమిత్తము వాకు వాటాదార్ల అధికారము యిచ్చినందున నేను కలకత్తా, ఢిల్లీ, బొంబాయివగైరా అనేక ముఖ్యపట్టణములకు వెళ్లి పెక్కు వాణిజ్య ప్రముఖులను, కేంద్రప్రభుత్వమువారిని కలసికొంటిని. మిల్లుముందు జయప్రదముగా పని చేయుటకుగాను కొత్త మేనేజింగు ఏజంట్ల ఏర్పాటునిమిత్తము ప్రయత్నములు చేయుచున్నాను. ఈమధ్య జరిగిన విషయములను బట్టి యీమిల్లు అమితలాభకరమైనదని స్థిరపడినందున సదరు లాభములు వాటాదారులను పొందనివ్వకుండ తామే పొందవలయు ననే దురుద్దేశముతో అనేకులు వాటాలను ఖరీదు చేయుటకు బయలుదేరిరి. వాటాదారులు మిల్లును అమ్ముటకు ఎంతమాత్రము సమ్మతించనందున, వేరు గత్యంతరము లేక, ఒక్కొక్క పేరుగానైనను కొని మిల్లును స్వంతముచేసికొనుటకు యిదిమరియొక ప్రయత్నము. కాని పూర్వపుగతియే యిప్పుడుకూడ సంభవించుట తథ్యము. వాటాలను అమ్మకపోవుటయే గాక మన వ్యతిరేకులకు సరియైనపాఠము చెప్పి వాటాదార్లు మొదటికంటియు బహు సాహసముగా నున్నందుకు శ్లాఘనీయులు. కాగితపరిశ్రమకు వున్న యీ పుచ్చుపళ్లలో వాటాదారు లెవరునూ వారిపేర్లను విడనాడుకొనరని నా దృఢనమ్మకము. మిల్లు ప్రస్తుతము పనిచేయుచున్నది—కాగితము తయారగుచున్నది. లాభమంతయు వాటాదారులదే. మనము పస్పళోదిగిన రణముపై వడ్డీ డబ్బులకు మాత్రమేకాని లాభమునందు యితరులకు ఎట్టిహక్కును లేదు గాన వాటాలను అమ్మవలదని మనవిచేయుచున్నాను.

కాకినాడ, 5-9-42. | ఇట్లు నీ విధేయుడు, వైడా వెంకటనారాయణ,

**శ్రీకృష్ణ ఆయుర్వేద ఫార్మసీ**
హెడ్డాఫీసు: ఏలూరు.
శాస్త్రోక్తమైన, గుణవంతములయిన సమస్త ఆయుర్వేద ఔషధములు యుద్ధపూర్వపు ధరలకు విక్రయించబడును.
కేటలాగు ఉచితము.

## గంటలపంచాంగం

చిత్రభాను సం॥శ్రావణ బ॥ చతుర్దశి
1942 సం॥ సెప్టెంబరు 9 బుధవారం
యి॥ చతు రా 8-9 మ రా 1-1 వర్జ్యం ప 12-15 మొ 1-57 కు.
బ॥అమా॥ సెప్టెంబరు 10 గురువారం
గు॥ అమా రా 3-36 పూర్వ రా 2-1 వర్జ్యం ప 9-21 మొ 11-1 కు.

ఆంధ్రపత్రిక
1942-వ సం॥ సెప్టెంబరు 8 తేది
మంగళవారము

## ధరలనిర్ణయము

ధరలనిర్ణయించుట చాల కష్టమైన పని. ఆ విధముగా నిర్ణయింపబడిన ధరలను అమలు జరుపుట మరింత కష్టము. క్రయ విక్రయములు కేవలము వ్యక్తులచే గాక, వర్తకసంఘములచే జరుపబడు పద్ధతి విశేషముగ వ్యాప్తియం దున్న ఇంగ్లండులో గూడ, అధికారులు నిర్ణయించు ధరలకును ఆచరణలో వర్తకులు వసూలుచేయు ధరలకును పొంతనుమాత్రమును పోలిక యుండుటలేదు. వర్తకులు, హెచ్చు ధరలను వసూలు చేయు "దొంగ వ్యాపారము" విపరీతముగ హెచ్చిపోయిన దని, ఇటీవల ఆంగ్లదేశములో ప్రజలు గగ్గోలు పెట్టగా, అధికారు లీవిషయమై విచారణను గూడ జరిపింపవలసివచ్చినది. అట్టి సందర్భమున, చిల్లరవ్యాపారమున అత్యధికభాగము, వ్యక్తిగతములగు లాభములకొరకు దుకాణములపెట్టుకొను వర్తకులపై ఆధారపడియున్న యీ దేశమున, ధరలనిర్ణయము నచులు జరుపుట యెంత కష్టమో వేరుగ చెప్పనక్కర లేదు.

కాని, ఆంగ్లదేశమునందలి స్థితికిని ఈ దేశమునందలి పరిస్థితులకును ఒక్క భేదము గలదు. ఆంగ్లదేశమున ప్రజాజీవితమున కత్యవసరమగు ఆహారాది పదార్థములలో చాల భాగము విదేశములనుండి రావలసియున్నది. ఈ దేశమున పట్టిపదార్థములలో నత్యధికభాగము దేశమునందే ఉత్పత్తియగుచున్నవి. బియ్యము మొదలగు సరకులు స్వల్పముగ లోటుగనున్నను, ఉత్పత్తిని అధికమొనర్చి భర్తీ చేయుచున్నారు. ఆ విధముగ ఉత్పత్తిమైన సరకును-ఆయాప్రాంతములయందలి ఆవశ్యకతలను సరిగదెలిసికొని—అచటకు రవాణాసౌకర్యములకల్పించిన యెడల, అన్నిప్రాంతములకును సరకులు సమృద్ధిగ లభించును. అపుడు, మధ్యవర్తకులు హెచ్చు లాభములకొరకు ధరలను విపరీతముగ పెంచుటకు అవకాశముగూడ తగ్గును. అందుచే, నిన్న ఢిల్లీయందు కూడిన ధరల కంట్రోలు సమావేశమున సూచింపబడినట్లు వేర్వేరు ప్రాంతములకు గావలసిన పదార్థములను సంపాదించుటకును, ఆ విధముగ కొనబడిన సరకులకు రవాణాసౌకర్యములయందు లగ్రస్థానము నొసగుటకును కావింపబడు ఏర్పాటులు అమలులోనికి వచ్చుచో ఈ సమస్య కొంతవరకు తగ్గునని చెప్పవచ్చును.

కాని అంతటితో, సమస్య పూర్తిగ తొలగునని చెప్పుటకు వీలులేదు. ఆయా ప్రాంతములకు చేరిన సరకులను ప్రజలకు న్యాయమగు ధరలకు అందజేయు సమస్య ఇంకను అటులనే యుండును. ప్రభుత్వ వాణిజ్యసభ్యుడగు ఎస్. ఆర్. సర్కారుగారి సందర్భమున ప్రసంగించుచు, ప్రస్తుత మీ సరకులలో వ్యాపారమొనర్చు వర్తకులే చాల వరకీకార్యముకొరకుపయోగించుకొనబడుదురని తెలిపిరి. కాని, వర్తకుల ద్వారానే అధికారులు విధించిన ధరలకు క్రయవిక్రయముల జరిపించు పద్ధతిని ఇంతవరకును, చక్కెర, కిరోసిన్ నూనె, కాగితము మొదలగు అనేకవస్తువుల సందర్భమున అమలుజరిపిచూచిరి. ఈ విషయమున ఇంతవరకును ప్రజలకు గల్గిన అనుభవము ఏమాత్రమును సంతృప్తికరముగ లేదని చెప్పవలసియున్నది. చాలమంది వర్తకులు తమసద్ద సరకువున్నను, అధికారులు నిర్ణయించిన ధరలకంటె చాల హెచ్చుమొత్తములకు దప్ప విక్రయించుటలేదు. ఇక మీద, ఆహారధాన్యాది ఇతర సరకులకు ధరల నిర్ణయించినపుడు వీరి పద్ధతి సూచనని తలచుటకు కారణము గనుపింపదు. అందుచే, ఈ వర్తకులకు గూడ విక్రయార్థము సరకులపరిమితముగ సప్లయి చేయుచునే యున్నను, ప్రభుత్వము వారు వేర్వేరు ప్రాంతములలో ప్రజలకు సరకుల న్యాయమైన ధరలకు విక్రయించుటకు "డిపో"లను ఏర్పరుపవలెను. వీనిని అధికారులు తాముగ నెలకొల్పవచ్చును. లేనిచో, స్థానికప్రజాప్రముఖులు గల అధికారేతరసంఘముల నియమించి, వారి అజమాయిషీక్రింద విక్రయముల జరిపింపవచ్చును. ఈ పద్ధతిని, గత మహాసంగ్రామాంత్య వత్సరములలో నీ రాష్ట్రమున అనుసరించియుండిరి. అపుడది చాల వరకు సంతృప్తికరముగనే పనిచేసినది. నేడు తిరిగి ఆ పద్ధతి ననుసరించుట కెట్టిఆక్షేపణయు గనుపింపదు. అందుచే నీ పని కేకమీద, సహకార సంఘములను, వేర్వేరు ప్రాంతములలో డిపోలను నెలకొల్పి న్యాయమగు ధరలకు సరకులను ప్రజాసామాన్యమున కందజేయుటకు అధికారేతరులగు స్థానికప్రజాప్రముఖుల సహాయమును గూడ పొందుటకు ప్రయత్నించెద రని నమ్ముచున్నాము.

## వ్యాఖ్యలు-విమర్శలు

"దేశంలో ప్రస్తుతం రాజకీయ ప్రతిష్టంభనం ఏర్పడివుంది. దానిని పరిష్కరించటానికి అనేకులు అనేకమార్గాలు సూచిస్తున్నారు... పత్రికల్లో రోజూ ఒక్కొక్క రొక్కొకపరిష్కారవిధానాన్ని తెలియచేస్తూ వుంటారు. కాని, ఇవన్నీ కూడా పాక్షికమైనవే. ఇందుచేత ప్రభుత్వం వీటిని ఎన్నటికీ అంగీకరించదు." అంటూ రాజప్రతినిధి కార్యనిర్వాహక సభ్యుడు సర్ మహమ్మద్ ఉస్మాన్ గారు నిన్నటిదినం లాలీహాల్‌లో వుపన్యసిస్తూ అన్నారు.

* * *

భారతసమస్యా పరిష్కార విధానాలను సూచించినవారి లో సర్ మహమ్మద్ ఉస్మాన్ గారితోబాటు రాజప్రతినిధికార్యనిర్వాహకసభ్యులైనవారు కూడావున్నారు. వీ రందరిలోకి వుపజ్ఞగలవాడనీ, ముస్లింలీగు నాయకునికంటె కూడా ఒక ఆకు ఎక్కువ చదివినవాడనీ అనిపించుకున్నవాడు భారతఖండాన్ని పంచబంగాళంగా పంచమన్న సర్ ఫిరోజ్ ఖాన్ నూన్ గారు! తమతోడి సభ్యులైన నూన్ గారి విధానాన్ని కూడా పాక్షికమైన వాటికింద నూ, ప్రభుత్వంవారంగీకరించజాలని విధానాలకింద నూ పరిగణిస్తారా? భారత ప్రభుత్వంవారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచేది సర్ మహమ్మద్ ఉస్మాన్ గారా? సర్ ఫిరోజ్ ఖాన్ నూన్ గారా?

* * *

ఇతరులు సూచించిన పరిష్కారవిధానాలేమీ పనికి రావంటూనే సర్ మహమ్మద్ ఉస్మాన్ గారు భారతసమస్యా పరిష్కారానికి తమకు తోచినమార్గం బయటపెట్టారు. అదేమనగా, జిన్నాసాహెబు గారి నాయకత్వంక్రింద ముస్లింలీగు బలపడివున్నదట. ముస్లింలీగు ప్రాధాన్యతను గుర్తించి, వారి మతములను అంగీకరిస్తేనే గాని ఈ సమస్య పరిష్కారం కాదట. ముస్లింలీగు మతములను వ్యక్తం చేసేవున్నారు. పాకిస్థాన్ హక్కును ముందుగా అంగీకరిస్తేనే గాని దేశంలో ఏరాజకీయ పక్షంతోగానీ, తాము రాయబారాలు జరపనని జిన్నా గారు బొంబాయి సభానంతరం ఖండితంగా చెప్పేశారు. కాబట్టి పాకిస్థానాన్ని ఆమోదించమని సర్ ఉస్మాన్ సాహెబుగారు తమ నోటిమీదుగా అనకపోయినా, వారి వుద్దేశ్యం అదేనని స్పష్టపడుతూనే వుంది.

* * *

ముస్లిం లీగుయొక్క ప్రాముఖ్యతనూ, జిన్నా సాహెబుగారియొక్క నాయకత్వాన్ని గుర్తించజాలిన సర్. మహమ్మద్ ఉస్మాన్ గారు హిందూ మహాసభయొక్క ప్రాముఖ్యాన్నీ, శక్తులు, భారత క్రైస్తవులు మొదలైన తదితరమైనారిటీల అభిప్రాయాలను ఎందుచేత గమనించలేరో దురూహ్యంగా వుంది. భారతఖండం యొక్క విభజనకు గాని, మతప్రయుక్తమైన స్వయం నిర్ణయసూత్రానికిగాని తాము ఎంతమాత్రం అంగీకరించ జాలమని హిందూ మహాసభవారు చేసిన తీర్మానాన్నిగురించి సర్ ఉస్మాన్ సాహెబుగారు ఏమంటారు? పెషావర్ ముస్లిం నాయకుడైన హాకీం అబ్దుల్ జలీల్ నాడ్వీగారు సర్. ఫిరోజ్ ఖాన్ గారి స్కీమును విమర్శిస్తూ ముస్లింలీగుకు, హిందూమహాసభకు ఉభయులకూ అంగీకారయోగ్యమైన విధానాన్ని కాంగ్రెసు ఆమోదిస్తుందని ప్రకటించారు. వుభయసంఘాలకు సంతృప్త చేకూర్చవలచిన సర్. మహమ్మద్ ఉస్మాన్ గారు ఇందుకు పాటుబడతారా?

* * *

హిందూ మహాసభగాని, ముస్లింలీగుగాని ఏవిధమైన మతములను నిర్గయించినప్పటికిన్నీ భారత రాజకీయ పక్షాలన్నిటిలోకీ ప్రధాన రాజకీయపక్షమైన కాంగ్రెసు తనప్రతిపత్తిని స్పష్టంచేసేవున్నది. బ్రిటిషుప్రభుత్వము అధికారాన్ని భారతీయులపరంచేసేట్టయితే ముస్లింలీగుకే యావదధికారాన్ని వప్పగించి తాను తొలగివుండటానికి కూడా సిద్ధమేనని కాంగ్రెసు ప్రకటించింది. కాబట్టి భారత సమస్యాపరిష్కారానికి ప్రతిబంధకం అధికారాన్ని ప్రజలకు సంక్రమింపచేయటానికి బ్రిటిషుప్రభుత్వంయొక్క అనిష్టతయేగాని వేరొకటికాదని సర్ మహమ్మద్ ఉస్మాన్ గారివంటి ముక్తిమంతులు గ్రహించలేక పోవటం మిక్కిలి విచారకరం కాదూ?

## అమెరికాలో ధరల పెరుగుదల

**ధరలు తగ్గించుటకు అధ్యక్షుడు అధికారము కోరెను**

కాంగ్రెసుకు ప్రెసిడెంటు రూజువెల్టు సందేశము

వాషింగటను, సెప్టెంబరు 7:—
అమెరికాలో ధరలు విపరీతముగా పెరిగిపోయినవి. ఈ ధరలను నియమించుటకు తనకు అధికారము కావలెనని కోరుచు ప్రెసిడెంటు రూజువెల్టు కాంగ్రెస్ వారికి ఈ క్రింది సందేశము పంపెను:—

జీవితమునకు కావలసిన ఖర్చులు విపరీతముగా పెరిగిపోవుటచే నేను గత ఏప్రేలు మాసములో కాంగ్రెస్ వారికి 7 సూచనలు గావించి యుంటిని. ధరలు పెరుగుటవలన కలుగు అనర్థములను నేను మీకు వివరింపబనిలేదు. అన్నివస్తువులధరలు నియమించినప్పుడే ప్రయోజనము కలుగునని అనుభవమువల్ల తెలియవచ్చినది. ఇప్పుడు పాలములలో పందుపంటలధర, పాలు, జెన్న, మీగడ మున్నగు వానిధర విశేషముగా పెరిగిపోయినది. దీనితోబాటు పనివారికూలి హెచ్చినది. ముందుగూడ యిట్లే ధరలు పెరుగుచుండుచో రయితులకు కూలివారికి వర్తకులకు, వీరు, వారనేలే అందరికి నష్టము కలుగును. యుద్ధప్రయత్నమునకుగూడ అంతరాయము కలుగును.

కనుక ధరలను, జీతములను, కూలిని, లాభములను గూడ నియమింపవలసి యున్నది. ఈ పని చేయుటకు అక్టోబరు 1 తేదీ లోపుగా కాంగ్రెసువారు నాకు అధికార మొసంగవలెను. మీరీపని చేయనిచో బాధ్యత నాపై బడును.

యుద్ధములో జయించుటకు అవసరమైన పనులన్నియు చేయుటకు నాకు రాజ్యాంగ విధానముద్వారా అధికారముకలదు. ఐనను ప్రజాప్రతినిధిప్రభుత్వమునం దభిమానము కలవాడనగుటచే నేను యిందు విషయమై మీతో సంప్రదింప గోరుచున్నాను. విజయమున కవశ్యమగు అన్నిచర్యలు నేను గైకొనెదను. సైనికవిజయములతోబాటు మనదేశములో ఆర్థికస్థిరత్వముగూడ అవసరము. ఇట్టి ఆర్థికస్థిరత్వము లేనిచో మనకై పోరుచున్న సైనికులు తిరిగి వచ్చునప్పుడు పలు కష్టములు పడవలసియుందురు.

## ఈజిప్టులో శత్రువిమానపోరాటం

—(:)—

**మధ్యరంగంలో కొలదియుద్ధం**

మధ్యధరాసముద్రంలో శత్రునౌకానష్టం

కైయిరో, సెప్టెంబరు 7:—
దక్షిణరంగంలో హిట్లరు టాంకులు పట్టల పరుగునవద్దనుంచి జర్మను సేనలు ఇటీవల ముందుకు చొచ్చుకొని వచ్చినను, తిరిగి జర్మను సేనలు మొన్నటిదినం వెనుకకు యథాస్థానమునకు తరిమివేయబడెను. కాని జర్మనులు తిరిగి ముందుకు పోవలెననియు, ఇప్పుడున్న స్థావరములనైనను కట్టుదిట్టముగా కాపాడుకోవలెననియు చాలా పట్టుదలగా నున్నారు. అందువల్ల జర్మను టాంకులు మోటారులు ఫిరంగులు యెక్కువగా అచటకు చేర్చబడి ఆప్రదేశమునందే మరింత ఎక్కువగా బందోబస్తు చేయుచున్నారు. కాని, ఆ జర్మను సేనలను అచటినుండి కూడా ఇంకా వెనుకకు తరిమివేయవలెననే ఉద్దేశముతో నిన్నటిదినమంతయు బ్రిటిషు ఫిరంగులు జర్మను సేనలపై ఎక్కువగా కాల్పబడెను. న్యూజిలాండు పటాలమొకటి ముందుకు పంపబడెను. జర్మనుసేనల మకాములపై దండెత్తి తిరిగి వచ్చెను. ఇటీవల జర్మను సేనలను వెనుకకు తరుమగొట్టినప్పుడు జర్మను సేనల తాలూకు ఆయుధసామగ్రియును ఇతర సామగ్రిస్వాధీనము న్నవారికి చాలా నష్టమైనవి. అందువల్ల రామెలు సేనాని తిరిగి ముందంజవేయుటకు తగిన సామగ్రి బలంలేనివాడై యున్నాడు. రామెలు సేనాని హిమెటాటు పర్వత ప్రాంతములను ఆ గుట్టలను ఆక్రమించుటకు తిరిగి ముందుకు రావలెనని కోరికతోనే ఉన్నాడు కాని, ఆ గుట్టలచుట్టును బ్రిటిషుసేనలు స్థిరంగా మకాంచేసియున్నవి. అందువల్ల జర్మనుసేనల కది సులభమైన పనికాదు. అందువల్ల ఎల్ ఆలీమను రంగములో జర్మను సేన ముందుకురాలేక స్తంభించియున్నది.

ఉత్తరరంగంలో జర్మనుసేన ముందుకు రాలేకుండానే ఉంది.

### జర్మనుసేనాని మరణం

ఈజిప్టుఎడారిలో జరిగిన పోరాటంలో 21వ జర్మనుటాంకుదళమునకు అధిపతియగు జనరల్ వాన్ బిస్మార్కు యుద్ధంలో హతుడయ్యెను.

### శత్రువిమానసంచలనం హెచ్చుట

శత్రువిమానాలుమాత్రం కొలదిగా విజృంభించి పనిచేయుచున్నవి. 15 బాంబు విమానాలు, 15 పోరాటవిమానాలు వచ్చి క్రిందుగా ఎగురుచు బాంబులుకురిపించెను. మిత్రమండలివిమానాలు ఎదిరించిపోరాడెను. ఆనాడు మిత్రమండలి విమానాలు 10 మాత్రమే నష్టమైనవి. ఆ విమానాలతాలూకు 6 గురు పైమానికులు క్షేమంగాఉన్నారు.

### ఇటలీప్రభుత్వప్రకటన

లండను, సెప్టెంబరు 7:—
గత సోమవారంనాడు ఇటలీప్రభుత్వ మిట్లు ప్రకటించెను:—
నిన్న యీజిప్టులో మధ్యరంగంలో ఒక పోరాటం జరిగెను. బార్డియామీదను, టాబ్రూకువిమానదళ సిరాస్ దీవిమీదను బ్రిటిషు విమానాలు బాంబులువేసెను. ఒక ఇటాలియను నౌకలయుద్ధవిమానకూడా బ్రిటిషువిమానాలు టార్పిడోలను ప్రయోగించెను.

### శత్రు నౌకానష్టం

అలెగ్జాండ్రియా, సెప్టెంబరు 7:—
గత కొలదివారములలో మధ్య ధరాసముద్ర తూర్పు ప్రాంతములలో శత్రువు తాలూకు 7 వర్తకనావలు బ్రిటిషు విమానములచే ముంచివేయబడెను.

బ్రిటిషు జలాంతర్గాములు కూడా మరికొన్ని శత్రునావలను నష్టపరచెను. పైవెచ్చివ 7 శత్రునావలు నష్టమగుటయే గాక మరొక 3 నావలను బ్రిటిషు జలాంతర్గాములు నెడగొట్టెను.

### శత్రువుల నావల రాకపోకలు

మధ్యధరాసముద్రమున కు అడ్డముగా శత్రునావలు అటు ఇటు తిరుగుచునే యున్నవి. పెద్దనావల ముఠాలు వచ్చుటలేదు చిన్న నావల ముఠాలుమాత్రమువచ్చిపోవుచున్నవి. కాని అవితరచుగా తిరుగుచున్నవి. ఈ నావలు యీజిప్టులోని జర్మనుసేనలకు సామగ్రులను చేర్చుచున్నవి. శత్రుసేనలను కూడా చేర్చుచున్నవి. ఈనావలు ఆపరకులను బెంగాజీరేవుకు ట్రాబ్రూకురేవుకు చేర్చుచున్నవి. ట్రిపోలీరేవుకుమాత్రం నిరంతరంగా సామగ్రులు సైన్యములు చేర్చబడుచున్నవి.

ఈనావలను బ్రిటిషు జలాంతర్గాములు అడ్డగించుచునే యున్నవి. అని మధ్య ధరాసముద్రములోని బ్రిటిషు నౌకాదళాధిపతియగు అడ్మిరల్ సర్ హెచ్ రీహార్వుడ్డుగారు చెప్పిరి.

## సమాధాన యత్నములు

**రాజగోపాలాచారిగారికి ఆహ్వానము**

**డా॥ ముఖర్జీగారి ఆలోచనలు**

ఢిల్లీ, సెప్టెంబరు 8:—
"మీరు నేడే మదరాసునుంచి బయలుదేరి ఢిల్లీకి రావలెను. మీ రిప్పుడు ఢిల్లీలో వుండుట ముఖ్యావసరము" అని శ్యామప్రసాదు ముఖర్జీ, ఖానుబహాదరు అల్లాబక్షు బందేవసింగుగార్లు ముగ్గురూ కలిసి నేడు సి. రాజగోపాలాచారికి మదరాసుకు అంతర్వార్తను (అర్జంటు టెలిగ్రాం) పంపారు.

ఢిల్లీ, సెప్టెంబరు 7:—
మహాసభ వుపసంఘసభ్యులు ముఖర్జీ, ఘటర్జీ, ఖన్నాగార్లు అమృతసరునుంచి నేడు ఢిల్లీ వచ్చారు. వీరు లాహోరులోను అమృతసరులోను చాలామంది నాయకులతో మాట్లాడారు. "వారందరున్ను మా సూచనలను శ్రద్ధగా వినుటవలన మాకు వారధికమైన ప్రోత్సాహమునకులిగించినవాళ్లై నారు మేము సిక్కు, హిందు, ముస్లిం మతముల నాయకులతో మాట్లాడాము. మహాసభవారు ముందంజ వేయగలుగుతారని మేమాశిస్తున్నాము." అని ముఖర్జీగారు చెప్పారు. వీరు ఢిల్లీలోని నాయకులతో రెండు మూడు రోజులపాటు యీ విషయమునుగురించి సంభాషిస్తారు. ఈ సంభాషణలవల్ల ప్రస్తుత పరిస్థితులలో చాలా ముఖ్యమైన ఫలితము కలుగవచ్చునని అందరున్ను ఆశిస్తున్నారు.

### మహాసభ ప్రధానకార్యదర్శి ఢిల్లీకి ప్రయాణము

లక్నో, సెప్టెంబరు 8:—
మీరు నేడేబయలుదేరి ఢిల్లీకి రావలెనని లక్నోలోవున్న భారత హిందూ మహాసభ ప్రధాన కార్యదర్శి రాజామహేశ్వరదయాలుసేట్‌గారికి ఢిల్లీలోవున్న ముఖర్జీగారు అర్జెంటు టెలిగ్రామును పంపినందున సేటుగారు నేడువుదయమున ఢిల్లీకివెళ్లారు. మహాసభ వుపసంఘ సభ్యులు రేపుఢిల్లీలో పంజాబు ప్రధాన మంత్రి సర్ సికందరు హాయతుఖాను, బెంగాలు ప్రధానమంత్రి ఫజులులుహాకు, సింధు ప్రధానమంత్రి ఖానుబహాదరు అల్లాబక్సుగార్లతో ఆలోచిస్తారని తెలిసింది. (అ. ప్రె.)

## నగర కళాశాలల పరిస్థితి

**విద్యార్థులు యథాక్రమముగా తరగతులకు హాజరగుచున్నారు**

మదరాసు, సెప్టెంబరు 8:—
చెన్నరాజధాని కళాశాల మదరాసుమెడికలుకాలేజి, స్టాన్లీ మెడికలుకాలేజి విద్యార్థులు. మేరిరాణి కాలేజివిద్యార్థినులు నేడు యథాక్రమముగ అందరు తరగతులకు హాజరగుచున్నారు.

ప్రెసిడెన్సీకాలేజి విద్యార్థుల సమ్మెను నడిపించిన విద్యార్థులపై అధికారులెట్టి చర్యను తీసుకోలేదని తెలుస్తున్నది.

నిన్నటితోజున పెటురిసరి కాలేజి విద్యార్థులు చాలామంది కాలేజీకి వెళ్లలేదు.

### ఆర్టు స్కూలు

గవర్నమెంటు ఆర్టుస్కూలు విద్యార్థులు అధికసంఖ్యాకులు నిన్న తరగతులకు వెళ్లుట మానిరి. వారు యిదివ్రాశారం కొన్నిరోజులుగా పాఠశాలకు వెళ్లకున్నారు. విద్యార్థులను తరగతులకు హాజరుకమ్మని ప్రిన్సిపాలు నిన్న విజ్ఞప్తి గావించెను.

### ఇంజనీరింగు కాలేజి విద్యార్థుల తీర్మానం

గత శనివారం 2 లయోలా కాలేజి విద్యార్థులకు కొరడా దెబ్బల శిక్ష విధింపబడినందుకు అసమ్మతి దెలుపుటకుగాను నిన్న సమ్మెజేసిన ఇంజనీరింగు కాలేజి విద్యార్థులు మధ్యాహ్నమున కాలేజిలో సభచేసి విద్యార్థుల కొసగిన కొరడా దెబ్బశిక్షను ఖండిస్తూ తీర్మానం గావించిరి. సమ్మెచేయు విద్యార్థులపేర్లను కొట్టివేయుమని ప్రభుత్వం చేసిన ఉత్తరవును రద్దుచేయవలెననియు కాంగ్రెసు నాయకులను విడుదల చేయవలెనని కూడా కోరుకూ తీర్మానాలు గావింపబడెను.

### ఇద్దరికి శిక్షలు

మదరాసు, సెప్టెంబరు 7:—
కొన్నిరోజులక్రితం రాయపేటలో ప్రభుత్వ ప్రతికూలచర్యలు చేసినట్లు ఆరోపణపై అరెస్టు చేయబడినవేమిని, వాసగి అనువారికి రాజధాని ప్రధాన మేజిస్ట్రేటు శ్రీ జి. వెంకటేశ్వరన్ ఐ. సి. యస్. గారు చెరి 6 నెలల కఠినశిక్ష, డిఫెన్సు రూల్సు ప్రకారం విధించిరి.

## రాజమండ్రి ఆంధ్ర పేపరుమిల్సు

—(*)—

**కాగితము తయారుచేయుచున్నది**

కైతాన్-అండ్ ఆప్టేకంపెనీ నడిపించుచున్నారు

రాజమండ్రి, సెప్టెంబరు 7:—
ప్రస్తుతము ఆంధ్రపేపరు మిల్సుకైతాన్ అండు ఆప్టేఅను బొంబాయి కంపెనీవారు నడిపించు చున్నారు. వీరు ఆంధ్రపేపరు మిల్సుకు ఏజంట్లుగా మాత్రమే పనిచేయుచున్నారు. కనుక ఇప్పుడు కూడ మిల్సు ఆంధ్రపేపరుమిల్సు అను పేరుతోనే నడచుచున్నది.

ప్రస్తుతము పనిచేయుచున్న ఏజంట్లు కున్ను, పూర్వపు మేనేజమెంటుకున్ను ఏ విధమైన సంబంధము మిల్లును నడిపించుటయందు లేదని రూఢిగా తెలియుచున్నది.

ఈ కైతాన్ అండ్ ఆప్టే కంపెనీవారు మిల్లును ఆగస్టు 4వ తేదీనుండి నడిపించుచు 21 వ తేదీనుండి కాగితముతయారుచేయుట ప్రారంభించిరి.

వాటాదారులుకూడ ప్రస్తుతపరిస్థితులలో మిల్లునడచుటే ముఖ్యోద్దేశముగా కలిగియున్నట్లు తెలియుచున్నది. (స్వ. వి.)

## చెన్నరాష్ట్ర పరిస్థితి

**ప్రభుత్వ ప్రకటన**

5వ తేదీరాత్రి జలగంపును తిరునల్వేలి జిల్లాలో తిరుచ్చందూరులో పోస్టాఫీసు తనులబెట్టటానికి ప్రయత్నంచేశారు. గ్రామస్తులు వచ్చేసరికి పారిపోయారు.

రామ్నాడుజిల్లాలో శివగంగాగ్రామంలో నొక బట్టల దుకాణం లూటీ చేయబడ్డది. సెప్టెంబరు 6 వ తేదీ చెల్లవారిఝామున పొల్లాచి హైస్కూలులో రెండు పాకలు కాల్చివేయబడెను. ఇతర జిల్లాలో సెమ్మెడగానున్నది.

మదరాసులో పచ్చయ్యప్ప కాలేజి తప్ప తక్కిన కాలేజీలన్నీ మామూలుగా పనిచేస్తున్నాయి.

గుంటూరులో అన్ని కాలేజీలు, ఆంధ్రయూనివర్సిటీ కాలేజీతో సహా మామూలుగా పనిచేయుచున్నవి.

మలబారు దత్తమండలాలలో కాలేజిలు స్కూల్సు కూడా మామూలుగానే పనిచేస్తున్నవి అని ప్రభుత్వ ప్రకటన దెలుపుచున్నది.

### మధుర జిల్లాబోర్డు రద్దు

మదరాసు, సెప్టెంబరు 8:—
కాంగ్రెసుకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు మధురజిల్లాబోర్డునురద్దుచేశారు.

### చెన్నరాష్ట్రంలోమొత్తం 171అరెస్టులు

మదరాసు, సెప్టెంబరు 8:—
చెన్నరాష్ట్రంలో డిఫెన్సురూల్సుక్రింద యిప్పటివరకు మొత్తంమీద 171 మంది అరెస్టు చేయబడియున్నారు.

## స్థానిక సంస్థల రద్దు

**వ. గోదావరి, నెల్లూరు డిండిగలు**

మదరాసు, సెప్టెంబరు 8:—
పడమటి గోదావరిజిల్లాబోర్డు, నెల్లూరు మునిసిపలు సంఘం, డిండిగలు మునిసిపలు సంఘములు, కాంగ్రెసు తీర్మానమును బలపరచి యుద్ధ కార్యాలకు విరుద్ధముగ ప్రవర్తించినందుకు ఆయా నెలలవరకు వాటిని రద్దుచేయుచు ప్రభుత్వం వారు ఉత్తరువుచేసి స్పెషలు ఉద్యోగులను నియమించిరి.

### రైళ్లు అలస్యంగా వచ్చుట

మదరాసు, సెప్టెంబరు 8:—
నిన్న సాయంత్రం చెన్నపురికి రావలసిన బొంబాయి ఎక్స్ప్రెసు 11 గంటలసేపు ఆలస్యముగా ఈవాళ ప్రాతఃకాలమున చెన్నపురికి వచ్చెను. మార్గమున ఈ బండికి ఆటంకము కలిగెనని తెలుస్తున్నది.

కలకత్తా మెయిలు ఈవాళ ఉదయము 9-20 గంటలకు, బొంబాయి మెయిలు 8-40 గంటలకు చెన్నపురికి వచ్చెను.

### పచ్చయ్యప్పకాలేజి

పచ్చయ్యప్పకాలేజిలో నిన్న హాజరైన స్వల్పసంఖ్యా విద్యార్థులలో మరికొందర

# ఉత్తరహిందూస్థానం పరిస్థితులు

## ఢిల్లీలో పోలీసుల తుపాకి కాల్పులు

బొంబాయిలో శాంతపరిస్థితి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:—

ఒకరిని అరెస్టుచేసి పోలీసుస్టేషనుకు లారీలో పోలీసులు తీసుకొనిపోవుచుండగా జనసమూహము ఆ లారీని అటకాయించిరి. పోలీసు లప్పుడు తుపాకులుప్రేల్చిరి. ఎవరికీ గాయాలు తగులలేదని తెలుపబడినది.

### బొంబాయి

#### నగరం క్రమస్థితికి వచ్చెను

బొంబాయి, సెప్టెంబరు 7:—

బొంబాయిరాష్ట్రమున జిల్లాలందు నేడు పరిస్థితులు శాంతంగా నుండెను.

బొంబాయిలో ఆదివారం జరిగిన అల్లరులనే తాత్కాలికంగా కలిగిన కల్లోలస్థితి పోయి మళ్లీ క్రమస్థితి ఏర్పడెననియు బొంబాయి ప్రభుత్వ ప్రకటన తెలుపుచున్నది.

బాదరులో చబిల్దాస్ బాలికాపాఠశాల విద్యార్థినులు కొందరు యీదినం మధ్యాహ్నం ఒకఊరేగింపు జరిపిరి. వారు చబిల్దాస్ బాలుర పాఠశాలకువెళ్లి అక్కడబాలురతో కలిసికొని ఊరేగింపు సాగించిరి. తరువాత పోలీసులు ఊరేగింపును చెదరగొట్టి 5 బాలికలను అరెస్టుచేసిరి.

శివాజిపార్కు ప్రాంతంలో వేరొకఊరేగింపు జరుపయత్నం గావింపబడెను. పోలీసు ఆయత్నం సాగకుండాచేసి ముగ్గురిని అరెస్టుచేసిరి.

బొంబాయి ప్రముఖ కాంగ్రెసు వాది శ్రీ ఉమాశంకరు దీక్షిత్‌గారు దేశరక్షణ నిబంధనలక్రింద ఈవాళ సాయంత్రం అరెస్టు చేయబడిరి.

#### 120 మందికి పైగా అరెస్టుచేయబడుట

బొంబాయి, సెప్టెంబరు 6:—

నిన్న రాత్రి జరిగిన అల్లరులకు తర్వాత పోలీసులు తాకూర్వాడ్ ఘన్సవాడి, హనుమాన్‌సందు మున్నగు ప్రాంతాలలో అల్లరి చర్యలలో పాల్గొనియుందురని సందేహం కలిగిన సుమారు 120 మందిని అరెస్టుచేసిరి.

కొందరు తుంటరులు నిన్న రాత్రి విద్యుచ్ఛక్తి పాతపరికరాలు అమ్మే ఒక అంగడిలోప్రవేశించి సామానులను దొంగతనంకొనిపోయిరి. కల్బదేవి,గిర్గాములందు బస్సు, ట్రాముబండ్ల రాకపోకలు తాత్కాలికంగా ఆపబడెను.

సుండుదెబ్బ తగిలిన ఒక వ్యక్తి చికిత్సానంతరం ఆసుపత్రినుండి పంపివేయబడెను.

కల్లోల ప్రాంతమున యీ ఉదయంనుండి ఎట్టి అల్లరిజరిగినట్లు వార్త రాలేదు.

విద్యాసంస్థలకు హాజరైన విద్యార్థుల సంఖ్య అన్నిటిలో తక్కువగనే యుండెను. కొన్ని కళాశాలలనేటుట విద్యార్థులు ప్రదర్శనాలు గావించిరి. హెచ్చు ధర అలవెన్సును యింకా ఎక్కువగా యివ్వవలెనని కోరుతూ రెండు రెక్సు రైల్సు మిల్లుల పనివారు పని మాని బయట వచ్చిరి.

#### పూనాలో విద్యార్థులకు శిక్షలు

పూనా, సెప్టెంబరు 7:—

ఎక్కువ సంఖ్య విద్యార్థులు పూనాలో యీ దినం తరగతులకు వెళ్లలేదు. కొందరు తమతమ విద్యాసంస్థలవద్ద పికెటింగు జరిపిరి.

యస్. వి. కాలేజి, ఫర్‌గూసన్ కాలేజి విద్యార్థులు తమ కళాశాలల ఆవరణలో జాతీయపతాక వందనోత్సవాలు జరిపినట్లు తెలుపబడుచున్నది.

కేసు విచారణలేకుండా యర్రవాడజైయిలులో నిర్బంధమున నుండువిద్యార్థులలో 13 మంది కేసులను ఆడిషనలు నగర మేజిస్ట్రేటు యర్రవాడ జైయిలులో యీవాళ విచారించి తీర్పువెప్పెను. ఇద్దరు విద్యార్థులు క్షమాపణ కోరి యికవిడుదల పత్రం పొందిరి కలిగియుండునట్లు పూచీయిచ్చిరి. తతిమా 11 మందికి చెరి 3 నెలల కఠినశిక్ష, రూ. 100 జరిమానా ప్రత్యామ్నాయంగా మరి రెండు నెలలశిక్ష విధింపబడెను.

#### ప్లీడర్లకు గాజులు పంచినసేరమున్నై అరెస్టు

అహ్మదాబాదు, సెప్టెంబరు 7:—

కోర్టుకు వెళ్లుచుండిన ప్లీడర్లకు వారి గుమాస్తాలకు ఒకవ్యక్తి గాజులను పంచిపెట్టుచుండగా పోలీసులచే యీవాళ అరెస్టు చేయబడెను.

ఊరేగింపులు జరుపటానికి పలుచోట యత్నాలు జరిగెను. ఇందుకుగాను పోలీసులు కొందరిని బాలికలను సహా అరెస్టు చేసిరి. ఆబాలికలను తరువాత వదలివేసిరి రెండు తపాలాపెట్టెలు కనబడనట్లు తెలిసెను.

### మధ్యరాష్ట్రం

#### సాముదాయిక జరిమానాను తగ్గించుట

నాగపూరు, సెప్టెంబరు 7:—

మధ్యరాష్ట్రమున నారసోని అను గ్రామంమీద రూ 5000 సాముదాయిక జరిమానా విధించుటకు మొదట ప్రభుత్వం నిశ్చయించెననియు యిపుడా జరిమానా మొత్తమును రూ 3000 లకు తగ్గించుటకు నిశ్చయింపబడె ననియు మధ్యరాష్ట్ర ప్రభుత్వప్రకటన తెలుపుచున్నది.

#### ఉద్యోగుల ప్రశంస

కాంగ్రెసు ఉద్యమాన్ని అణచి ప్రజాశాంతిస్థాపన కార్యమునకు తోడ్పడిన ప్రభుత్వోద్యోగుల సేవలను గవర్నరుగారు ప్రశంసిస్తూ నొక సందేశ మంపియున్నారు.

### సంయుక్తరాష్ట్రం

#### సాముదాయిక జరిమానాలు

లఖ్నో, సెప్టెంబర్ 7:—

సంయుక్తరాష్ట్రంలో ఆరు జిల్లాలమీద మొత్తం రూ 143500 సాముదాయిక జరిమానా విధింపబడియున్నది.

#### కాన్పూరులో అరెస్టులు

కాన్పూరు, సెప్టెంబరు 7:—

తనచేరు 'హిందూస్థానీ' అని తెలియజేసిన యొకవ్యక్తిని పోలీసులు దేశరక్షణ నిబంధనలక్రింద కాంగ్రెసు ఉద్బోధ వాక్యాలు అరచినందుకు అరెస్టుచేసిరి.

బి. యస్. యస్. డి. కాలేజిని మూయించుటకు యత్నించిన 4 గురు విద్యార్థులను దేశరక్షణ నిబంధనల క్రింద పోలీసులు అరెస్టుచేసిరి.

### బెంగాలు

#### కలకత్తాలో కొద్ది అల్లరులు

కలకత్తా, సెప్టెంబరు 7:—

ట్రాము సర్వీసుకు ఆటంకం కలిగించినందుకు తుంటరులు యింకా యత్నాలు గావిస్తూనే యున్నారు. ఈ వాళ మధ్యాహ్నం కారన్‌వాలిస్ రోడు, హారిసన్ రోడులందు 2 ట్రాముబండ్లనున నష్టపరచేందుకు తుంటరులుయత్నించిరి. ఎట్టి నష్టంకలుగకముందే పోలీసులు వచ్చి జనసమూహమును చెదరగొట్టిరి.

చిట్పూరు ప్రాంతంలో నిన్న జరిగిన సంఘటన నిమిత్తమై యీదినం పోలీసులు 8 రిని అరెస్టుచేసిరి.

#### విద్యాసంస్థలు తెరువబడుట

ఆగస్టు 14 తేదీనుండి మూసియుండిన కలకత్తా కాలేజీలు హైస్కూళ్లు యీవాళ తెరువబడెను కొన్ని విద్యాసంస్థలకు కొద్ది సంఖ్యవిద్యార్థులు హాజరైరి. నగరం స్థితి నెమ్మదిగానున్నది.

#### విధ్వంసక వర్యలు చేసేవారికి కొరడాదెబ్బల శిక్ష

బెంగ్లూరు, సెప్టెంబరు 7:—

రైల్వేలయిన ఫ్యాక్టరీలయిన ఆస్తులను, టెలిఫోను, టెలిగ్రాఫు విద్యుచ్ఛక్తి తీగెను నాశనంచేయువారికి యికమీదట మరణదండనగాని లేదా కొరడాదెబ్బలశిక్షగాని విధింపబడునని బెంగ్లూరు కంటోన్మెంటు జిల్లా మేజిస్ట్రేటు ప్రకటించుచున్నాడు. రైల్వే ఆస్తులు మున్నగునవి గల ప్రదేశాలకు సమీపమున సందేహాస్పదమగు సందర్భములలో కనబడేవారికికూడా యీ శిక్షలే విధింపబడును. (అ. ప్రె.)

## హార్రులు ఒక రైలుబండిని అటకాయించుట

కరాచి, సెప్టెంబరు 7:—

డ్రైవరు సామర్థ్యంవల్ల నిన్న నొక మెయిలు రైలునకు కొప్పప్రమాదం తప్పినది.

సుమారు 160 మంది హార్రులుగల ఒక గ్యాంగు రైలుమార్గంమీద పెద్దరాళ్లను పెట్టి యిసుకదిబ్బల వెనుక దాగియుండిరి. డ్రైవరు ఆ యిసుకదిబ్బ లుండుటచూచి సందేహించి కడుసామర్థ్యంతో బండిని అతివేగంగానడిపి బండిబోర్లపడకుండా క్షేమముగా ఆప్రాంతంనుండి వెళ్లునట్లు చేయగల్గెను. ఆయిసుకదిబ్బల వెనుక దాగియుండిన హార్రులు బండిమీద తుపాకులు పేల్చిరి. డ్రైవరుకు, ఫైర్‌మెన్‌కు ప్రయాణికులకు గాయాలు తగిలెను. వారికి వెంటనే చికిత్స ఒసగబడెను. రైల్వేపోలీసులు సుమారు 20 మైళ్లవరకు యీహార్రులను వెంబడించి వారియొక్క 5 ఒంటెలను పట్టుకోగల్గిరి. ఉభయపార్టీలు బండోరులపై తుపాకులు ప్రేల్చెను. పోలీసులూ గ్యాంగిని యింకా వెంబడిస్తున్నారు. (అ. ప్రె.)

# కాంగ్రెసు ప్రముఖుల అరెస్టులు

## డా॥ జీవరాజ్ మెహతా ఖిటన్‌లాలు సాక్సేనాగార్లు నిర్బంధింప బడుట

బొంబాయి, సెప్టెంబరు 7:—

వెనుక ఎడ్వర్డురాజు స్మారక ఆసుపత్రిలో డీనుగానుండిన డా॥ జీవరాజ్ మెహతాగారు దేశరక్షణ నిబంధనల క్రింద యీ రాత్రి అరెస్టు చేయబడిరి

#### సాక్సేనా అరెస్టు

గోరక్పూరు, సెప్టెంబరు 7:—

ఏ. ఐ. సి. సి. సభ్యులు శ్రీ ఖిటన్‌లాలు సాక్సేనా యం. యల్. ఏ. (యు. పి.) గారు మహరాలాన్ తాలూకా సుర్దోవా గ్రామంలో నిన్న అరెస్టు చేయబడిరి. అక్కడనుండి వారిని పోలీసులు గోరక్పూరుకు తీసుకొనివచ్చిరి. గోరక్పూరు బెనారెసు డివిజనులలో ప్రవేశించరాదని శ్రీ సాక్సేనాగారికి సం॥ రా॥ ప్రభుత్వం వెనుక ఉత్తరవు చేసియుండెను.

#### కాంగ్రెసువాదులకు శిక్షలు

లయల్పూరు, సెప్టెంబరు 7:—

జరన్వాలా కాంగ్రెసువాదులు నలుగురికి వెరో 6 నెలలకఠినశిక్షను లయల్పూరు అడిషనలు జిల్లామేజిస్ట్రేటు విధించెను.

సాముండ్రిలో అరెస్టు గావింపబడిన 7 గురు కాంగ్రెసువాదులకు 4 నుండి 6 నెలల వరకు పలురీతిగా శిక్ష విధింపబడెను. మరి నల్గురికి కోర్టు ముగిసేవరకు శిక్ష ఒసగబడెను.

#### శ్రీమతి కమలాదేవి అరెస్టు

బెంగ్లూరు, సెప్టెంబరు 7:—

శ్రీమతి కమలాదేవి చట్టోపాధ్యాయగారిని పోలీసులు శనివారంరాత్రి బసవన్నగుడిలో దేశరక్షణ నిబంధన 26 క్రింద అరెస్టు చేసి సెంట్రలు జెయిలులోనుంచియున్నారు.

#### కొయంబత్తూరు పురపాలక సంఘాధ్యక్షుని అరెస్టు

కొయంబత్తూరు, సెప్టెంబరు 7:—

కొయంబత్తూరు పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ కే. సుబ్రహ్మణ్యంగారిని దేశరక్షణ నిబంధనలక్రింద పోలీసులు అరెస్టు చేసిరి.

#### తిరుచినాపల్లిలో అరెస్టులు

తిరుచినాపల్లి, సెప్టెంబరు 7:—

తిరుచినాపల్లి పోలీసులు నిన్నరాత్రి 5 కాంగ్రెసువాదులను, యీవాళ ఉదయమున ఒకరిని అరెస్టుచేసి అందరిని సబ్‌జెయిలులో నుంచిరి. శ్రీ యస్. హోలాస్వంగారు అడ్వకేటు యీవాళ ఉదయం అరెస్టుచేయబడిరి. (అ. ప్రె.)

## కీ॥ శే॥ అయ్యగారి శేషమ్మగారు

### దైవసన్నిధిని మరణము

అమలాపురం, సెప్టెంబరు 5:—

కాకినాడ కాపురస్థులు అయ్యగారి సూర్యనారాయణగారి ధర్మపత్ని శ్రీమతి శేషమ్మగారు అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామివారి కోయిలలో ఆగస్టు 24 వ తేదీ ఉదయం చనిపోయిరి. ఆమరణవిశేషముల చిత్రములు ది 18-8-42 తేదిని రాత్రి యిక్కడ వీరన్న అల్లునియింటికి శ్రీ సత్యనారాయణస్వామివారు విచ్చేసి భక్తురాలను శేషమ్మగారిని తన సాన్నిధ్యమునకు అన్నవరంరమ్మని అల్లున (క్రా) సుబ్రహ్మణ్యశర్మకు పుత్రాని తనకోరిక వెలిబుచ్చగా ఆమర్నాడు బయల్దేరి మధ్యలో కాకినాడలో తునిలో ఆగి త్రయోదశి సోమవారం ఉ॥ 9 గం॥కు 24-8-42 తేది శ్రీ సత్యనారాయణమూర్తి వారి దర్శనమునకు కుమారుడు మనూర్లైలతో అన్నవరంవచ్చిరి. పంపానదిలో స్నానముచేసి, పట్టుబట్టలు ధరించి, శ్రీ స్వామిదర్శనమునకు, సువాసూసముగా కొండపక్కవారు. శ్రీ సత్యనారాయణస్వామి ముఖమంటపమునకు వచ్చుసరికి శ్రీమతి శేషమ్మగారు కీర్తిశేషులైనారు. దహనక్రియలు అన్నవరంలోనే జర్గించినారు. కీ॥ శే॥ శేషమ్మగారిఆత్మకు శ్రీ సత్యనారాయణమూర్తి శాంతి చేకూర్చుగాక. (ఒ. వి.)

## తూ॥ గోదావరి నేతగాండ్ర సహకారసంఘసమావేశము

### రాజమండ్రి

సెప్టెంబరు 5:—గతవారము రాజమండ్రి సహకారసంఘపు డెప్యూటీ రిజిస్ట్రారుగారి ఆఫీసులో తూర్పుగోదావరిజిల్లా నేతగాండ్ర సహకారసంఘ ప్రతినిధుల సమావేశము జరిగెను. ఈ సభకు మదరాసు రాష్ట్రీయ చేనేతగాండ్ల సహకారసంఘ కార్యదర్శియైన శ్రీ వి. సత్యనారాయణగారు, డిప్యూటీ రిజిస్ట్రారు రావుసాహెబ్ కె. సుబ్రహ్మణ్యంనాయుడుగారు, నరసింహదేవర సత్యనారాయణగారు వచ్చిరి.

వీరు సంఘాభివృద్ధి, ఆర్థికవిషయము, నూలు సరఫరా, తయారైన వస్త్రముల అమ్మకముగూర్చి చర్చించిరి. డిప్యూటి రిజిస్ట్రారుగారు జిల్లాలోని సంఘములలోపమును వివరించుచు, ఉత్పత్తినిగూర్చియు, కాలమునకు అనుగుణమగు మార్పులనుగూర్చియు హెచ్చరించిరి.

సంఘ ప్రతినిధులు ఎప్పటికప్పుడు సంఘములను పరిస్థితిని, అభివృద్ధిని తెలిసికొనుటకుగాను ప్రతి మూడుమాసములకు సమావేశములు కావలె నని కోరిరి. (స్వ. వి.)

# రష్యాయుద్ధం

(1 వ పేజి తరువాయి)

సమీపించుకొలదియు వేలకొలది జర్మనులు హతులు గుచున్నారు. సెబాస్టపూలువలె స్టాలిన్గ్రాదుకూడా శత్రువుతో చివ్వరివరకు పోరితీరును.

### కాకససు రంగం

మాస్కో, సెప్టెంబరు 7:—

కాకససు పడమటిభాగమున నల్లసముద్రపుతీరమగు నవరాసిస్కు తమవశమైనట్లు జర్మనులు చెప్పినమాటలలో సత్యములేదని రష్యనుప్రకటన తెలిపినదిగాని ఇచ్చట యుద్ధము బాగా తీవ్రతవహించినదని ఒప్పుకొనుచున్నది. "జర్మనులాంకు సముదాయములను అనేకసార్లు ఎదుర్కొంటిమి. రష్యను సైకాదళ సైనికులు ఈపట్టణమువద్ద ఒకకొండను రక్షించుచున్నారు." అని ఈ ప్రకటనలోకలదు.

### గ్రాజ్నీకి 50 మైళ్లలో శత్రుసేన

కాకససు తూర్పుభాగంలో గ్రాజ్నీ పెట్రోలు గనులవంకకు పోవుమార్గమున టెరెక్ నదినిదాటివచ్చిన జర్మనులను మట్టుపెట్టు ప్రయత్నములను రష్యను లింకను విరమించలేదు. పెట్రోలు గనులకు ఇంకను శత్రువు 50 మైళ్ల దూరములో నున్నాడు. ఒకటి రెండుచోట్ల శత్రువును కొంచెము వెనుకకు నెట్టివేసిరి.

### మాస్కోరంగం

మాస్కోరంగములో జూకావుగారి రష్యనుసేనలు, జర్మను సైనికస్థావరములపై విధివిరామములేకుండ ఫిరంగులు బారుపెట్టి నిమిషమునకు ఆరు ఫిరంగిగుండ్లచొప్పున ప్రేల్చుచున్నవి. బాంబులు మరఫిరంగిగుండ్లుగూడ మాటిమాటికి ఆకాశమునుండి గ్రుమ్మరించినట్లు వచ్చి శత్రుసేనల మీద పడుచున్నవి.

### రష్యాకు సహాయము

లండను, సెప్టెంబరు 7:—

బ్రిటిషు పార్లమెంటరీ కార్యదర్శియగు తర్టిల్‌గారు బ్రిటిషు రష్యను ప్రతినిధులు గల ఒక సమావేశములో ఇట్లు ప్రసంగించిరి:

"జర్మనులపరాక్రమము చల్లారినతర్వాత రష్యా ఇంకను అజేయముగా నుండగలదు. యూరోపుపై దండెత్తి రెండవ రంగము ప్రారంభించుటవల్లగాని మరి యితర ఉపాయములవల్లగాని రష్యనులకు త్వరలోతగిన సహాయమొనరించుటకు చర్చిలుగారు ఒప్పుకొనివచ్చిరి. ఈ యుద్ధములో బ్రిటిషువారు తమ యావచ్ఛక్తిని వినియోగించుట లేదనుట పొరసాటు. యూరోపులో అడుగిడుట సామాన్య కార్యముకాదు. అందుకు బ్రహ్మాండమగు సన్నాహము లవసరము. త్వరపడి యూరోపులో ప్రవేశించి నెగ్గజాలక వెనుకకు వచ్చితిమేని మనకేగాక రష్యాకు కూడా మహాపకారము జరుగును."

## మార్కాపురం రైతుల దుస్థితి

మార్కాపురం, సెప్టెంబరు 4:—

ఈ పట్టణరైతులు మద్రాసు గవర్నరుగారి సలహాదారులకు, రెవిన్యూ అధికారులకు పన్నికువర్కు డిపార్టుమెంటు యింజనీరుగారికి ఈపట్టణచెరువు వట్టిపోయినదనియు, చెరువుకు నీరువచ్చు గుండ్లకమ్మకాలువ పూడిపోయినందువల్ల గుండ్లకమ్మనది 4,5 దఫాలు పొలపలు పారినను ఒకచుక్కయిన చెరువులో లేకుండుట కడు విషాదాంశమనియు, చెరువుక్రిందను కాలువక్రిందను గల వార్లు యెండిపోవుచున్నవనియు, త్వరలో ప్రభుత్వాధికారులు సదరు కాలువను రిపేరుచేసిన, ప్రస్తుత పట్టణపరిస్థితులు కొంతవరకు చక్కపడుననియు తంతివాళ్లలను మహజరులను పంపుకొనియున్నారు.

సదరు చెరువుకాలువగతి 12 సంవత్సరములుగ దేలాటి రిపేరులేకుండుటచే ఆనకట్ట మొదలు చాల దూరమువరకు పూడిపోయినది. త్వరలో ప్రభుత్వమువారు తగు చర్య గైకొనిన, చావ సిద్ధముగ నున్నవార్లు బ్రతుకును.

క్షేమప్రదమై
శుభ్రమైన
పరిపూర్ణమగు బిడ్డల ఆహారము
Glaxo
గ్లాక్సో
వేడినీటితో మాత్రమే
ఒక్కక్షణములో
చేయవచ్చును.
యజమానులు ఖరీదును హెచ్చింపలేదు

గుండు మందు
కాల్పులను గమనించుట !

మానవునిచే తయారుచేయబడిన గుండుమందు, బాణాసంచులు, తనజాతిమీదనే ప్రయోగించిన అతి దుర్ప్రయోగమగును. ఎల్లకాలము బిడ్డలకు సంతోషము కలుగజేయు నిమిత్తము ఎట్టి అపాయమునకు గాని, దౌర్జన్యప్రబలత్వమునకు గాని తావియ్యక సామాన్యరీత్యా గుండుమందును కాల్చుటకు మరేదారిలేనందున ప్రస్తుతము పైచెప్పినవిధిత్తమై కొందరు ఈ యుద్ధపుకాల్పులను ఎదుర్కొనుచున్నారు.

డిఫెన్సు సర్వీసులకు వలయు గుండ్లను తయారుచేయుటలో మాకంత సంతోషములేదు. సామాన్య జనులహృదయములకు సంతోషపెట్టు పెక్కురకముల క్రొత్త క్రొత్త పర్టులకు, సూటులకు వలయు గుండ్లను తయారుచేసిన మేమెంతో సంతసింతుము. అయితే ప్రస్తుతము రక్షణపు ఆవశ్యకత ఎక్కువగా యున్నది. శాంతిస్థాపన దైనతర్వాత గుండ్ల రకములనుండి సంతోషము పొందవలయును.

V వి అంటే విజయము ... తరువాత మీకు శ్రేష్ఠమైన సూట్లకు, పర్టులకు వలయు గుండ్లను ఈ ట్రేడ్ మార్కును బట్టి వీరుకొనుడు.

బిన్నీవారి బెంగళూర్ మిల్స్: ది బెంగళూర్ వుల్లన్, కాటన్, & సిల్కుమిల్స్ కం॥ లి॥

మేము దాన్నిచేయడానికి సహాయం చేస్తాం—అదెంతమంచిదో మాకు తెలుసు



## ప్రభుత్వ విధానమున కసమ్మతి

### బళ్లారిజిల్లాబోర్డు తీర్మానము

### ఆంధ్రదేశమున అరెస్టులు శిక్షలు

(మా విశేషవార్తలవద్దనుండి)

బళ్లారి, సెప్టెంబరు 5: — బళ్లారి జిల్లాబోర్డు అధ్యక్షులు నిన్న డాక్టరు నాగనగౌడుగారి అధ్యక్షతన సమావేశమై రెండు తీర్మానములజేసెను. మహాదేవ దేశాయిగారి మరణమునకు విచారము దెల్పుచు గాంధిమహాత్మునకును, మహాదేవు భార్యకును సాంత్వనవచనముల దెల్పుచు నొక తీర్మానము జేసిరి. మరియొక తీర్మానమున భారతప్రభుత్వమువారు జాతీయ వాంఛితమును లక్ష్యము జేయక అనవసరముగ నిర్బంధవిధానము ననుసరించి మహాత్మాజీని, అజరుగారిని యితర జాతీయనాయకులను బళ్లారి జిల్లాబోర్డు సభ్యుడు సీతారామ రెడ్డి గారిని నిర్బంధించినందులకు అసమ్మతి సూచకంగా సభను ఆపునలజేయుచు మరియొక తీర్మానము జేసిరి.

ఆలూరు హరిజన్ హాస్టెలుకు రెండు వందలు రూపాయలు విచ్చుమను తీర్మానించిరి.

### ఆదోనీ అరెస్టులు

బళ్లారి, సెప్టెంబరు 5.— గురువారంనాడు ఆదోనీ మ్యునిసిపలు ఆఫీసు ఆవరణంలో 144 సెక్షనుక్రింద సభజేయుగా పోలీసువారు లాఠీచార్జి చేసి గుంపును చెల్లగొట్టి ఆర్గురను అరెస్టుచేసిరి. అందు బలరామసింగుగారు సోమయాజులుగారు గలరు. జనము రాళ్లురువ్వి పోలీసువారిని నష్టపరచగా రెండోసారి లాఠీచార్జి చేయవలసివచ్చెను. ఇపుడు అతయు శాంతముగనున్నది.

బళ్లారి మ్యునిసిపలు హైస్కూలు విద్యార్థులు మహమ్మదీయ విద్యార్థులు తప్ప, నిన్న స్కూలుకు వెళ్లలేదుమానిరి.

### హొసపేటలో 144 సెక్షను

సెప్టెంబరు 5:— హొసపేట రెవిన్యూ డివిజన్ ఆఫీసరుగారు 3-9-42 తేదీ నుండి రెండునెలల వరకు అమలునందున వుండులాగున 144 వ సెక్షనును హొసపేట, కూడ్లిగి, హడగలి, హరపనహల్లి తాలూకాలయందున ప్రకటించియున్నారు.

### నిడుబ్రోలు

సెప్టెంబరు 6:—కోల్లిసుబ్బయ్య (నిడుబ్రోలు) ను పొన్నూరు పోలీసువారు, నిడుబ్రోలు రైల్వేస్టేషను తనులజెట్టివారను నేరముక్రింద, డిఫెన్సు ఆక్టు 35 సెక్షను 121 సెక్షను రయిల్వే ఆక్టుల క్రింద అరెస్టుచేసి పొన్నూరు సబుజైలులో వుంచిరి.

నిన్న అల్లం వీరయ్యను ఐ. పి. సి. 147 149, 427 436 సెక్షను డిఫెన్సు ఆక్టు 35 సెక్షన్ల క్రింద అరెస్టుచేసిరి.

### కర్నూలులో కమ్యూనిస్టు నాయకుల అరెస్టు

కర్నూలు, సెప్టెంబరు 7:— ఈనెల 5 వ తేదీ సాయంత్రము పోలీసులు జిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి యగు వి. భాపయ్యగారియిల్లు, అర్గురైజరు సి. పుల్లారెడ్డిగారి యిల్లు సోదాచేసి ఆక్షేపణీయమగు పుస్తకములను తీసుకొనిపోయిరి. పోలీసులు కమ్యూనిస్టులగు కె. వి. కృష్ణమూర్తి, ఆర్. తిప్పారెడ్డి గారల యిండ్లనుగూడ సోదాచేసి 'న్యూఏజ్' ప్రతిని మరికొన్ని పత్రికలను తీసికొనిపోయిరి. రాత్రి సమయమున శ్రీ భాపయ్యగారు అరెస్టుచేయబడిరి.

### 144 సెక్షను

కర్నూలు పట్టణములోను, తాలూకాలోను, 2 నెలల వరకు పట్టణ విద్యార్థి సంఘము, కమ్యూనిస్టులు యితరులు సభలు, ఊరేగింపులు జరుపరాదని 5 తేదీన కర్నూలు సబ్ మేజిస్ట్రేటు 144 సెక్షన క్రింద ఉత్తరువు జారీ చేసిరి.

జిల్లా కమ్యూనిస్టుపార్టీ అర్గురైజరు సి. పుల్లారెడ్డిగారిని, నందికొట్కూరు తాలూకా రయితుసంఘ కార్యదర్శియు శ్రీ సూర్యనారాయణగారిని డిఫెన్సురూల్సు క్రింద పోలీసులు 4 వ తేదీన అరెస్టుచేసిరి. శ్రీ సూర్యనారాయణ గారికి ఆశ్రయమిచ్చినందులకుగాను టాక్సీ డ్రైవరు రామస్వామిగారు నిన్న అరెస్టు చేయబడిరి. జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు డి. రంగారెడ్డిగారిని అరెస్టుచేసి స్థానిక జైలులో రిమాండునందుంచిరి.

నంద్యాల తాలూకా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కే. దయానందరెడ్డిగారిని, కాంగ్రెసువాదియగు మహబూబ్ సాహెబుగారిని మూడురోజులక్రింద అరెస్టుచేసిరి.

### నరసాపురం

సెప్టెంబరు 6:—ఆగస్టు 12వ తేదీని లేటిగ్రాఫ్ తీగెలు తెంపిరని ఆనంటకాపురస్థులు శ్రీయుత సెక్కాటి రామారావుగారిని పోలీసువారు అరెస్టుచేసిరి. నిన్నటివరకు నరసాపురములో రిమాండుమీద ఉండిరి. నిన్నటిదినమున వదలి వేసిరి.

2-9-1942 తేదీని పాలకొల్లు మ్యునిసిపల్ హైస్కూలు వద్ద పికెటింగు చేస్తూండగా పాలకొల్లుపోలీసువారు గోటేటి వెంకటవిజయరావుగారు, బొమ్మికంటి ప్రభాకరశాస్త్రి, దాట్ల సీతారామరాజు, నంధూరి సీతారామాంజనేయాచారి, పాలూరి సూర్యనారాయణ, అల్లు రామలింగయ్య, మామిళ్ళపల్లి సోమయాజులు, రావూరి శ్రీరామమూర్తి, కలిదిండి నారాయణరాజు గార్లను అరెస్టుచేసి మా నరసాపురం సబుమేజస్ట్రీటుగారి యెదుట న్యూసెన్సు క్రింద చార్జి పెట్టిరి. ఒక్కొక్కరికి రు 20 లు జుర్మానాగాని లేకపోతే రెండురోజుల జైలు వేసిరి. జుర్మానాను ఎవ్వరు నివ్వలేదు. నిన్ననే వీరి నందరిని విడుదలచేసిరి.

### కడప బార్ అసోసియేషన్ తీర్మానము

సెప్టెంబరు 7:— కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులైన శ్రీ కే. గుండురావు (అడ్వకేటు) గారి అధ్యక్షతక్రింద కూడిన న్యాయవాదులసంఘసభలో న్యాయవాదుల సభ సభ్యుడైన శ్రీ డి. రామసుబ్బారెడ్డి ఎం. ఎల్. సి. గారిని అరెస్టుచేసి నిర్బంధమునందు చినందులకు విచారము దెలుపుచూ వారిని వెంటనే విడుదల చేయవలెననియు, లేనిచో అతనిని కోర్టులో విచారణకు పెట్టవలెననియు, శాసనసభల అనుమతిలేనిదే విశేషముగా ఆర్డినెన్సులను ప్రయోగముచేయుట చాల శోచనీయమనియు, కొరడాతో దెబ్బలు కొట్టుట ఒకశిక్షగా విధించుట సరసించుచూ, సమునాయజులుమానాలు విధించుట సమంజసము కాదనియు తీర్మానములు గావింపబడెను.

### గ్రామప్రజలకు హెచ్చరిక

టెలిగ్రాఫ్ తంతెలతో ఏలాటిజోక్యం కలుగజేసుకొనినను లేక ఆటుల కలుగజేసుకొనినవారిని పోలీసులకు పట్టియివ్వకపోయినను, సమష్టిపన్ను విధింపబడునని తంగెడుపల్లె సోగలపల్లె అగ్రహారము క్రొత్త గంగిరెడ్డిపల్లె నందిమండలం గ్రామప్రజలకు కడప పోలీసు డిప్యుటీ సూపరింటెండెంటుగారైన శ్రీయం వెంకటప్పనాయుడుగారు ఒక హెచ్చరిక నొసగిరి.

### కడపలో అరెస్టులు

కడపజిల్లా చెన్నూరు గ్రామవాస్తవ్యులైన శ్రీ. పి. వాసుదేవరెడ్డి మఱి పదునలు పరిని నిన్నరాత్రి ఇండియా రక్షణచట్టముల క్రింద అరెస్టుచేసి కడప సబ్‌జయిలులో రిమాండునందుంచియున్నారు. వీరు చెన్నూరుదగ్గర నంకు చెన్నానది కాజ్‌వేను బంధలు, సిమెంటు బండలు తొలగించుచుండిరనియు, అందులకై అరెస్టుచేసినటుల తెలియుచున్నది.

### రాజాం

సెప్టెంబరు 5:—నిన్నటిదినం స్థానిక బోర్డు మిడిల్‌స్కూలు విద్యార్థులు బడికి వెళ్లుటమాని, జాతీయపతాకములతో జాతీయ నినాదములు చేసుకుంటూ వూరిలో వూరేగింపు జరిపిరి. అంతయూ ప్రశాంతముగా జరిగెనది. (స్వ. వి.)

### మదనపల్లిలో అసమ్మతి సభ

మదనపల్లి, సెప్టెంబరు 7:— మదనపల్లిలోని పదునెనిమిది సంఘముల యొక్క ప్రతినిధుల సంయుక్తసమావేశము మదనపల్లి విద్యార్థి ఫెడరేషన్ వారి యాజమాన్యమున శ్రీ ఏ. చెన్నబసప్పగారి అధ్యక్షతను జరుపబడి, ప్రభుత్వయొక్క దమన నీతిని నిరశిస్తూ దేశనాయకులను వెంటనే విడుదల చేయవలెనని కోరుచున్నను, ప్రభుత్వము, కాంగ్రెసు మస్లిం లీగులతో సంప్రదించి కేంద్రములో జాతీయ ప్రభుత్వమును స్థాపించవలెననియు కయ్యూరు కిసాను నాయకులను విడుదల చేయవలెననియు, త్తూరు జిల్లా మేజస్ట్రీటుగారు సభా సమావేశములపై గావించిన నిషేధపు టుత్తరువు ఉపసంహరించుకోవలెననియు కోరుచు తీర్మానించిరి.

పై తీర్మానములపై శ్రీయుతులు, బై. లక్ష్మీనారాయణ (జిల్లావిద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి) ఎ. సీతారామసింగ్, యం. వి. సాపన్నగుప్త (ఆంధ్ర మహాసభ సంయుక్త కార్యదర్శి) అఖిల్ ఆలీ, ఓ. వి. పెట్ట (తాలూకా పట్టణ కాంగ్రెసు సంఘములు) డి. సీతారామయ్య (కమ్యూనిస్టుపార్టీ) మొగిలప్ప (మదనపల్లి విద్యార్థి ఫెడరేషన్) కె. వాణేశ్వరరావు (యువజన సంఘము) ఆర్. నరసింహారెడ్డి (కిసాన్ సభ) మొదలగువారు వుపన్యసించిరి.

మదనపల్లి పంచాయతీబోర్డువారు సమావేశమై, ప్రభుత్వపు చర్యను నిరసిస్తూ, మహాదేవదేశాయి గారి మృతికి సానుభూతిని దెల్పుచూ, చేసినతీర్మానములు ఏకగ్రీవముగ ఆమోదింపబడెను. శ్రీయుతులు కె. బుస్సప్పశెట్టి, యం. వి. పాపన్న గుప్తగార్లు మాటలాడిరి. ఆర్. దస్తగిరి సాహెబుగారధ్యక్షతవహించిరి.

### గుంటూరులో అరెస్టు

సెప్టెంబరు 6:— గుంటూరు పోలీసువారు నిన్న సాయంకాలము శ్రీయుతులు యం. కట్టయ్య, ప్రతాప రామసుబ్బయ్య, (కమ్యూనిస్టులను) సెక్షను 129 ఇండియా దేశపు రక్షణచట్టముక్రింద అరెస్టుచేసి సబ్‌జైలులో నుంచిరి.

### అమలాపురం

సెప్టెంబరు 5:-తాణేలంక కాపురస్తులైన ఆకెళ్ల నరసింహమూర్తి, పాలెపూడి రాజేశ్వర రావూరావుగార్లు, నిమ్మక్రికాపురస్తులైన నంధూరి శివరాము శర్మగారు డిఫెన్సు ఆఫ్ ఇండియా రూల్సుక్రింద అంబాజీపేట సబ్ ఇన్‌స్పెక్టరుగారిచే అరెస్టుకాబడిరి.

### జమ్మలమడుగు

సెప్టెంబరు 7:— పులివెందుల కాంగ్రెసు నాయకులగు శ్రీ డి. రామకృష్ణారెడ్డి (చెర్మను నరసింహారెడ్డిగారి కొమారుడు) గారిని డిఫెన్సు ఆక్టుక్రింద అరెస్టుచేసి జమ్మలమడుగు సబ్‌జైలులో 15 రోజులు రిమాండునందుంచినారు వీరు పులివెందుల తాలూకా ఆఫీసువద్ద పికెటింగుచేయు సందర్భములో ప్రోత్సాహమిచ్చినారని అరెస్టుచేసినట్లు తెలియుచున్నది.

పులివెందుల తాలూకా గంగిరెడ్డిపల్లె వాస్తవ్యుడైన యన్. పి. గంగిరెడ్డి అనువారు యిదివరలో అనంతపురంలో యింటర్మీడియేటు చదువుచూయుండి, దేశనాయకులను అరెస్టు చేశందులకుగాను కాలేజి విడిచి వచ్చిరి. వీరిని పులివెందులలో జరుగు వుద్యమమునకు ప్రోత్సాహ మిస్తూయున్నారని అరెస్టుచేశి నిన్నటిదినం యిచ్చట సబ్‌జైలుకు తీసికొనివచ్చిరి వీరికికూడా 15 రోజులు రిమాండు యిచ్చినట్లు తెలియుచున్నది.

## ఆచార్య రంగా అరెస్టు

నిడుబ్రోలు, సెప్టెంబరు 7:— అఖిల భారత రైతునాయకులును, భారత కాంగ్రెస్ సంఘసభ్యులును, కేంద్ర శాసనసభా సభ్యులునుఅయిన ఆచార్యరంగా గారిని బాపట్ల సర్కిల్ యిన్‌స్పెక్టరు, పొన్నూరు పోలీసు సబ్ యిన్‌స్పెక్టరుతో వచ్చిడిఫెన్సు ఆఫ్ యిండియా 26 రూలు ప్రకారం, ఈ రోజు సాయంత్రం 4 గంటలకుఅరెస్టుచేశారు.

ఆచార్యరంగాగారి యిల్లు 'గోభూమి' ని అఖిల భారత కిసాన్ సభ దక్షిణాది కార్యాలయము, ఆంధ్ర రాష్ట్ర కిసాన్ సభ కార్యాలయం. గుంటూరుజిల్లా రైతు సంఘ కార్యాలయములను ఈరోజు సాయంత్రం 5 గంటల మొదలు 8-30 వరకు బాపట్లసర్కిల్ యిన్‌స్పెక్టరు పొన్నూరు పోలీసు సబ్ యిన్‌స్పెక్టరు గారలు డిఫెన్స ఆఫ్ ఇండియా చట్టము 26 వ సెక్షనుక్రింద ఉత్తరువు ప్రకారం సోదాచేశారు. పోలీసు కొన్ని కాగితాలుతీసుకపెళ్లారు.

ఆచార్యరంగాగారిని ప్రస్తుతం పొన్నూరు సబుజెయిలులో వుంచారు.

## చెన్నరాష్ట్ర చేనేత పారిశ్రామికుల సంఘం

### నిర్బంధవిధానమున కసమ్మతి

నిడుబ్రోలు, సెప్టెంబరు 4:— చెన్నరాష్ట్ర చేనేత పారిశ్రామికులసంఘ కార్యవర్గ సమావేశము శ్రీ దామర్ల రమాకాంతరావు యం. ఏ. గారి అధ్యక్షతక్రింద మంగళగిరిలో జరిగెను.

సభలో శ్రీ మహాదేవదేశాయి గారిఅకాల మరణమునకు తమ విచారము తెలియపర్చుచూ వారి కుటుంబమునకు సానుభూతి తెలియజేయుచూ, జాతీయనాయకులను ప్రభుత్వం వారు నిర్బంధించినందుకు ప్రభుత్వమువారి నిర్బంధవిధానమునకు తమ అసమ్మతి తెలియజేయుచూ, నాయకులను వెంటనే విడుదల చేయుచూ వెంటనే జాతీయప్రభుత్వమును నెలకొల్పవలెనని ప్రభుత్వమును కోరుచూ వెంటనే జాతీయనాయకులతో రాయబారములను సాగించవలయునని తీర్మానించిరి.

దూదిధరలను బట్టి నూలుధరలునిర్ణయించుమనియు, ప్రభుత్వమువారు స్వంతనూలు డిపోలను పెట్టి చేనేతపారిశ్రామికులకు అందుబాటులో వుండునట్లు చేయుమనియు రాష్ట్రీయ నూలుకమిషనరుగారికి సహాయపడుటకు ఏర్పడనున్న రాష్ట్రీయ నూలుసలహాసంఘములో చేనేత పారిశ్రామికుల సంఘపు జాయంటు కార్యదర్శి అగు శ్రీ ఇనుముత్తి వీరభద్రరావుగారిని సలహాసంఘ మెంబరుగా నామినేటు చేయుమనియు, చేనేతవస్త్రములకు లగేజి, పార్శెలులద్వారా రైళ్లలో రవాణా సౌకర్యములు కల్పించుమని రైల్వే అధికారులను కోరుచును చేనేతవస్త్రములను అమ్ముకొను చెత్తిమూటబట్టలకు ఫ్రీలైసెన్సు పొందనవసరములేకుండా వస్త్రనిర్యాతనట్ట సవరణ చేయుమని ప్రభుత్వమువారిని కోరుచూ తీర్మానించిరి. (స్వ. వి.)




## కిన్వానగరంవద్ద ఘోరయుద్ధం

### క్వాంగుటంగు రాష్ట్రంపై జపాను విమానదాడి

చుంకింగు, సెప్టెంబరు 7:— చికియాంగు రాష్ట్రమునకు ముఖ్యపట్టణమైన కిన్వా నగరమును చైనాసేనలు ముట్టడించుచున్నవి. కిన్వానగరద్వారములకు వెలుపల క్వాన్‌హీ పారోడ్డుమీద ఆదివారమంతయు తీవ్రయుద్ధము జరిగెను. జపానువారు నిరంతరంగా కొత్తసేనలను తీసికొని వచ్చి పోరాడుచునే యున్నారు.

చికియాంగు-కియాంగ్సీ రైలుమార్గము మీద నున్న టాంగి నగరమునకు పడమరగా నున్న టాంగి-ఘోమానురంగములో పోరాడుచుండిన చైనాసేనలు లాంసుయావో మీదకు దండెత్తి వచ్చి అచటినుండి కిన్వానగరము మీదకు దండెత్తి వచ్చుచున్నవి. యూంగసాంసను పట్టుకొనిన చైనాసేనలు టాంగ్యాంకు దక్షిణంగా ఉన్న సున్లిసుకోవద్దకు చేరెను. అందువల్ల టుంగ్యాంగువద్ద నున్న జపానుసేనలు వెనుకకు పారిపోయెను.

కిన్వానగర సమీపంలో గత శుక్రవారం నాడు వుష్మానువద్ద ఘోరయుద్ధం జరిగెను. అచట జపాను సైనికులు అపారంగా మరణించిరి. 100 మోటారు లారీలమీద హతులైన జపానుసైనికులు యుద్ధభూమినుండి కిన్వాకు చేర్చబడిరి.

లాంచీ ప్రాంతంలో యుద్ధమింకను జరుగుచునే యున్నది. అచటనున్న జపాను సేనలు వెనుకకు పారిపోయి కిన్వాకుపోయినవి.

ఆగస్టు 20 తేదీని, ఆన్వీ ఉత్తరభాగమందు జరిగిన యుద్ధములో 400 మంది జపాను సైనికులు మరణించిరి. జపానుసేనల తాలూకు సామగ్రి చాలా చైనావారికి చేజిక్కెను.

### హోనాను రాష్ట్రంలో

పీకింగ-హాంకో రైలుమార్గము మీద అనగా హోనాను రాష్ట్రంలో ఉన్న పిన్యాంకు వాయవ్యంగా ఉన్న జపాను సేనల మకాములమీదకు కూడా చైనాసేనలు దండెత్తుచునే యున్నవి.

### క్వాంగుటంగు రాష్ట్రంలో

61 జపాను విమానాలు 8 తరంగాలుగా నిన్నటిదినం క్వాంగుటంగురాష్ట్రం మీదకు హోనానురాష్ట్రంమీదకు వచ్చెను.

హోనానురాష్ట్రంలో పెంక్యాంగు పట్టణ పరిసరప్రాంతములపై ఆజపాను విమానాలు మరఫిరంగులను బారుచేసి కాల్చెను.

క్వాంటంగు శాస్త్రి ముఖ్యపట్టణమైన క్యాంటనునగరమునకు యీశాన్యంగాఉన్న లుంగ్మెన్‌మీద ఆ జపానువిమానాలు బాంబులు వేసెను.

### ఉత్తరచైనాలో జపానువ్రభుత్వం

జపానువారి ఆక్రమణలోనున్న ఉత్తర చైనాలో డాక్టరు బిలేఖరిగానున్న ఆంగ్లేయుడు యుద్ధఖైదీల మార్పువల్ల లాటెంకో మార్కెన్‌టీవికి (దక్షిణఅమెరికాలో ఆర్జెంటైనుకు చెందినదీవికి) చేరెను. అతడు యీ క్రిందిరీతిగా తెలియజేసెను.

ఉత్తరచైనాలో జపానువారు క్రొత్తరైలుమార్గములను నిర్మించిరి. దేశమధ్యంలోనుండి సముద్రతీరానికి యీ రైలుమార్గములు వేయబడినవి షెన్సీ పరగణాలోనుంచి సముద్రతీరము వరకు రైలుమార్గములను నిర్మించిరి. ఉత్తరచైనాలోనున్న బొగ్గునుల్నియు జపాను ప్రభుత్వం తీసికొన్నది. అచటి నేలబొగ్గు యావత్తు జపానుకు ఆరైళ్లమీద రవాణా చేయబడుచున్నది. పీకింగునగరానికి ఉత్తరముగా ఇనుముగనులు కలవు. అచట ఇనుము కరించే ఫ్యాక్టరీలు చైనావారిచే నిర్మింపబడియున్నది. ఆ ఫ్యాక్టరీల నన్నింటిని జపానువారే వశపరచుకొని పనిచేయుచున్నారు. అచటిపంటధాన్యములలో చాలా భాగమును జపానువారే తీసికొనుచున్నారు.

ఈవిధంగా ఉత్తర చైనాలోని వస్తుసంపద నంతను జపానువారే అనుభవిస్తున్నారు. కాని, ఉత్తర చైనాలోని చైనావారు తమ స్వాతంత్ర్య ప్రభుత్వము నే యిచట చలాయించుకొనుచున్నారని జపానువారు లోకానికి చాటుచున్నారు. ఉత్తర చైనా స్వతంత్ర రాజ్యాంగం గనుక అది మాకు శత్రురాజ్యంకాదని బ్రిటిషువారు అంటే, "కాదు అది మా ఆక్రమణలో వున్న రాజ్యమే" అని జపానువారు తిరిగి జవాబు చెప్పుచున్నారు.

### చైనా విదేశాంగ సహాయమంత్రి ప్రకటన

చుంకింగు, సెప్టెంబరు 7:— చైనా విదేశాంగ సహాయమంత్రి యిట్లు చెప్పినారు. జపానువారు సైబీరియామీదకు దండెత్తవచ్చుననే ప్రమాదపరిస్థితి యథాప్రకారంగానే ఉన్నది.

జర్మనీ మీదకు బ్రిటిషువారు దండెత్తి రెండోరంగం ప్రారంభిస్తారనే భయంచేత అందుకు ప్రతిక్రియగా 20 జర్మను కాల్బలపు డివిజనులను 8 మోటారు శకట డివిజనులను ఫ్రాన్సులో మకాముచేసియుంచెను.

### ఆక్యాబుమీద బ్రిటిషు విమానదాడి

ఢిల్లీ, సెప్టెంబరు 7:— నిన్న సెప్టెంబరు 6 తేదీని బర్మాలోని ఆక్యాబుమీద బ్రిటిషు విమానాలు బాంబులు వేసెను. మొన కూడా యీ రేవుమీద బాంబులు వేయబడెను. అచటి విమానాశ్రయంమీదను, బారకీచులమీదను, కిరసనాయిలు కొలీలమీదను, పైలెసు స్టేషను మీదను బాంబులుపడెను భవనములు ధ్వంసమైనవి. కిరసనాయిలు తగులబడుటవల్ల పెద్ద పొగ పైకిలేచెను.

THE BOMBAY MUTUAL LIFE ASSURANCE SOCIETY Ltd.

బాంబే మ్యూచుయల్ లైఫ్ అష్యూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

(స్థాపితము 1871.)

భారతదేశమున అనాదిగానున్న గొప్ప మ్యూచుయల్ లైఫ్ ఆఫీసు.

గత 70 సం॥నుండి భారతదేశమునకు సేవచేయుచున్నది

హెడ్ ఆఫీసు:

బాంబే మ్యూచుయల్ బిల్డింగు, ఫోర్టు, బొంబాయి.

నరసమైన షరతులకు ఏజంట్లు కావలెను.

ఈదిగువ అడ్రసుకు దరఖాస్తులను పంపుడు:

యస్. వి. రామస్వామి అండ్ బ్రదర్సు,

మదరాసు రాజధాని, తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానములకు చీఫ్ ఏజంట్లు:

సేలం.




ఉబ్బసపుదగ్గుకు వైద్యులంతా 'శ్వాసహారి'నే వాడుచున్నారు. 'శ్వాసహారి' అసలు రోగకారణములనే రూపుమాపి, శరీర తత్వమునకు ఏమీ చెడుపు కలుగనియ్యరు. ఒక్కమోతాదు వాడి గురక, కఫము తగ్గిపోవును. చక్కగా నిద్రపడుతుంది. ఆహారము బాగా జీర్ణమౌతుంది. మీ ఆరోగ్యం క్రమంగా చక్కబడుతుంది. ఊపిరితిత్తులు దార్ఢ్యమును పొందుతవి. ఉబ్బసపుదగ్గును నిశ్శేషముగా పోగొట్టగలమందు ఇదే. 3 బౌ॥ రు 2-8-0; 6 బౌ॥ రు 4-2-0; 12 బౌన్సులు రు 7-0-0. పెద్ద మందుల షాపులన్నిటిలోను దొరకును.

మదరాసు స్టాకిస్టులు:

అమృత రత్నాకర ఫార్మసీ, గోవిందప్పనాయక వీధి. శ్రీ కృష్ణన్ బ్రదర్స్, తంబుచెట్టి వీధి. అప్పా అండ్ కో, చైనాబజారు.

మాన్యుఫాక్చరర్స్: డాక్టర్ పురోహిత్ ఫార్మసీ, కొల్హాపూర్.

ఉత్తరప్రత్యుత్తరములు ఇంగ్లీషులోనే.

పురోహిత్ శ్వాసహారి

రానున్న ప్రమాదముల గురించి, నేడు దేశమంతయు అప్రమత్తతతో నున్నది. అవసరమగు జాగ్రతలు తీసుకొనబడు చున్నవి. మీప్రాణమును. మీకుటుంబమును రక్షించుకొనుటకు తగుజాగ్రతలు తీసుకొనుచున్నారా?

అత్యవసర వేళలో మీరు ఎవ్రెడి బ్యాటరీలు అమర్చబడిన ఒక ఎవ్రెడి ఫ్లాష్‌లైటుపై నాధారపడియుండవచ్చును. యెప్పుడూ ఒక ఎవ్రెడి బ్యాటరీల సెట్టును దగ్గరుంచుకొని సిద్ధముగానుండుడు!

అవిదీర్ఘకాలమువనివిమును

మనవి

సమస్త ఆయుర్వేద ఔషధములకు ఖ్యాతిగాంచిన నిలయం.

శ్రీ సంజీవిని ఆయుర్వేద ఫార్మసి,

హెడ్ ఆఫీసు, భీమవరం పా॥గో॥ (రిజిష్టర్డు)

క్యాటలాగు ఉచితము.

చ్యవనప్రాసలేహ్యం

తృప్తి, దుర్బలత్వము, దగ్గు, కఫము మొ॥వాటిని ఖండించి రక్తవృద్ధినిచ్చును. తు॥ 20 పౌ॥ రు 1/4 పోస్టేజి ప్రత్యేకము. పి. శ. ఏ. అండు కో ఆయుర్వేదసమాజం, పెరిదేపి, నెల్లూరుజిల్లా

Printed & Published by S. Samobu Prasad at the Andhra Patrika Press, 79 Thambu Chetty Street Madras.